ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 27.0

ఓటేయడం మీ బాధ్యత

- పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం
- వాటి పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్
- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



ఏలూరు, మే 11(ఆంధ్రజ్యోతి) : 'ఓటు హక్కు మాత్రమే కాదు ప్రతీ ఒక్కరి బాధ్యత. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలి. పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేశాం. గతంకంటే ఈ సారి పోలింగ్ శాతం పెరుగుతుం దని ఆశిస్తున్నాం. ఓటరు స్లిప్పులు అందరికి అందేలా చూశాం. దీంతోపాటు ఎన్నికల సంఘం గుర్తించిన ఆధార్ తో పాటు మిగతా గుర్తింపు కార్డులను పోలింగ్ కేంద్రానికి తమతో పాటు ఓటరు తీసుకెళ్లాలి' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు. పోలింగ్ నేపథ్యంలో ఎక్కడికక్కడ తీసుకున్న చర్యలను మరోసారి పునఃసమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో వేసవి దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు చేశామని అత్యవసర పరిస్థి తుల్లో అంబులెన్స్‌లు, ఆయా ప్రాంతాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ప్రశాం తంగా పోలింగ్ జరిగేందుకు ప్రజలు రాజకీయ పక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మద్యం దుకాణాలను శనివారం నుంచి మూసివేశామని ఎటువంటి ఉల్లంఘన లకు పాల్పడినా ఉపేక్షించమని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల సమీపాన 144 సెక్షన్ విధించామని ప్రకటించారు. ఎన్నికల సంఘం నియమా వళికి అణుగుణంగానే వ్యవహరించాలే తప్ప గీత దాటేందుకు అనుతించబోమని స్పష్టం చేశారు. మారుమూల గ్రామాల్లోనూ పోలింగ్ సజా వుగా సాగేలా మైక్రో అబ్జర్వర్లను నియమించామని, పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ సిబ్బంది తమకు నిర్దేశించిన ప్రాంతానికి చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం నుంచి పోలింగ్ సిబ్బందిని పోలింగ్ సామగ్రి ఆయాపోలింగ్ కేంద్రాలకు తరలిస్తామ న్నారు. ఎలాంటి ఫిర్యాదులున్నా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్ళాలని ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 1744 పోలింగ్ స్టేషన్లు 16.37 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు.

నోట్ల పండగ

ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు పంపిణీ

ఎవరిని కదిపినా అందరినోటా ఒకటే మాట.. ఓటు..నోటు. ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నా నగదు పంపిణీపై నిఘా నేత్రం ఉందని హెచ్చరించినా ఇదేది ఓటర్లకు నగదు పంపిణీని అడ్డుకోలేక పోయింది. 48 గంటలు ముందుగానే నోట్ల కట్టలు చేరాల్సిన చోటుకు చేరాయి. ఓటరు స్లిప్పులు అందిస్తున్నామనే నెపంతో పగలు రాత్రి తేడాలేకుండా ఇంట్లో ఎంత మంది ఉన్నారనది ఓట్లు లెక్కేసి మరి నోట్లు అందించారు. అధికార వైసీపీ అయితే విచ్చలవిడిగా బరితెగించి కొన్నిచోట్ల పక్కా ప్లాన్‌తో ఇంకొన్ని చోట్ల చెలరేగిపోయింది. ఈ లెక్కన ఒక్కో నియోజక వర్గంలో రూ.30 కోట్లు తగ్గకుండా నగదు పంపిణీ సాగింది. మరోవైపు పంతాలు, స్థానిక నేతల అలకలు తోడయ్యాయి.

- పట్టపగలే యథేచ్ఛగా అందజేత
- తెల్లవార్లు పంపిణీ జాతరే
- నియోజక వర్గానికి రూ.30 కోట్లు పైబడే
- ఎటుచూసిన బేరసారాలు.. అలకలు

ఏలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మరో 24 గంటల వ్యవధిలో పోలింగ్ జరగనుండగా ఊరువాడా నోట్ల కట్టలు తెగాయి. రాజకీయ పక్షాలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పోటీ పడ్డాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటుకు వెయ్యి చొప్పున చెల్లించేందుకు ప్రధాన పార్టీలు ముందుకు వచ్చాయి. అధికార వైసీపీ అయితే లక్ష ఓట్లు తగ్గకుండా ప్రతీ నియోజకవర్గంలోనూ వెయ్యి చొప్పున కొనుగోలు చేసేందుకు ఎప్పుడో వ్యూహం ఖరారు చేసినట్టు ప్రచారం. తొలుత ప్రతీ నియోజకవర్గంలో ఉన్న డ్వాక్రా సంఘా లను లక్ష్యం చేసుకొని ప్రతీ గ్రూపునకు 12 వేల చొప్పున చెల్లించారు. వీరిలో గ్రూపు లీడరుగా ఉన్న వారికి రూ.రెండు వేలు చేతికి ఇచ్చారు. మొత్తం సంఘాల మీద బాధ్యత తీసుకునేవారికి రూ.10 వేలు తగ్గకుండా ముడుపులు ఇచ్చారు. ఏలూరు, దెందులూరు, చింతలపూడి, ఉంగుటూరు నియోజకవర్గాల్లో వైసీపీ మూడవ కంటికి తెలియకుండా ఓటర్లకు నోట్లను విసిరింది. స్థానిక లీడర్లను ఓ గ్రూపుగా ఎంపిక చేసి తాము గుర్తించిన ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్యను లెక్కేసి ఆ మొత్తానికి ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున విభజించి ఓటర్లకు చేర్చేలా జాగ్రత్తలు పడ్డారు. దెందులూరు నియోజక వర్గంలో కొన్ని చోట్ల ఓటుకు రూ.1500 నుంచి రూ.2 వేలు పంచారు. ప్రతిష్టా త్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల్లో, లక్షల్లో బెట్టింగ్ సాగిన నియెజకవర్గాల్లో ఓటుకు అదే స్థాయిలో నోటు ధర పలికింది. ఏలూరులో ఓటుకు రూ.వెయ్యి చొప్పున పట్టపగలే పంపిణీ సాగింది. ప్రార్థనా మందిరాలను సైతం పంపిణీకి కొందరు అనువుగా మార్చేసుకున్నారు. గుంపులు గుంపులుగా ఉంటే అను మానం వస్తుందని కొందరు నేతలు పంపిణీకి వీటిని వాడుతున్నారు.

'రిజర్వుడు'ల్లోనూ తగ్గేదేలే

రిజర్వుడు నియోజకవర్గం చింతలపూడి పోలవరం నియోజకవర్గంల్లోనూ ఓటుకు కోట్లు గుమ్మరించారు. ఈ నియోజకవర్గాల్లో పంపిణీ మొత్తం ఎవరిది ఎక్కువైతే వారికే అనుకల ఫలితాలు వస్తాయని నానుడితో చింతలపూడి, పోల వరంలోనూ రూ.వెయ్యికి తగ్గ కుండా ఒక్కో ఓటుకు విసిరారు. ఈ క్రమంలోనే పంపిణీ ఎవరి చేతి మీద జరగాలన్న విషయంలో భేదాభిప్రాయాలు పొడచూపాయి. వాస్తవానికి 2014 కు ముందు ఈ నియోజకవర్గాల్లో ఓటుకు రూ.500 మాత్రమే పంపిణీ జరిగేది. ఇప్పు డు మిగతా నియోజ వర్గాలతో సమానంగా రూ.వెయ్యికు తగ్గకుండా పంపిణీ జరి గేలా ఓటర్లు కొందరు పట్టుబట్టి మరీ సాధిస్తున్నారు. 'ఇక్కడ పరిస్థితులు చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయి. అభ్యర్థులేమో డబ్బుల్లేవు అంటారు, మరి పంపిణీకి కోట్లు కోట్లు ఎలా వచ్చాయి. ఓటుకు వెయ్యి చొప్పున ఒక్కో నియోజకవర్గంలో 15 కోట్లు తగ్గకుండా ఖర్చు అవుతుంది. చూస్తుంటేనే బెరుకు పుడుతుంది'. రాజకీయాల్లో ఆరితేరిన వారే చేసే కామెంట్లు ఇవి.

● నిఘా ఏమైపోయినట్లు ?

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి రూ.50 వేలకు ఒక్కరూపాయి అదనంగా ఉన్నా ఆంక్షల పేరిట అధికారులు సీజ్ చేశారు. కానీ, పోలింగ్‌కు వారం ముందు నుంచే పోలింగ్ జరిగే ముందు రోజు వరకు ఓటర్లను మభ్య పెట్టేలా ప్రత్యేక టీమలుగా ఏర్పడి నగదు పంపిణీ చేస్తున్నా రు. దీనికి తోడు ఒక పార్టీపై మరో పార్టీ పంపిణీపై నిఘా పెట్టింది. మీరు ఫిర్యాదు చేస్తే మేము కూడా సిద్ధమంటూ బెదిరించి మరీ పంపి ణీ తతంగానికి దిగారు. దెందులూరు నియోజక వర్గంలో ఈ తరహా వాతావరణం ఎక్కువగా బయట పడింది. నూజివీడు, కైకలూరు నియోజక వర్గాల్లో పంపిణీకి ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, తీసుకోవడానికి ఓటర్లు పోటీ పడడం ఈసారి విశేషం. ఇంత జరుగుతున్నా నిఘా వర్గాల కంటి కి ఈ సీన్ కనిపించడం లేదా అనే ప్రశ్న ఉన్నది.

చివరి రోజే కీలకం



ఓటర్లను మభ్యపరచ డానికి అభ్యర్థులందరికీ చివరి రోజు ఆదివారం. దీని కి తగ్గట్టుగానే ఆయా పార్టీ లు ఆ పార్టీ అను కూలురుకు చికెన్, మటన్ కొనుగోలుకు సాయం చేస్తున్నాయి. మరికొన్ని అయితే ఆదివారం బిర్యానీ లతో ముంచెత్తడానికి వీలుగా ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తు న్నట్టు సమాచారం. గత ఎన్నికల్లో కొన్ని కుటుంబాలకు చేపలు, రొయ్యలు, మాంసం పంపిణీ చేశారు. ఆ తర్వాత ఇదంతా బయట పడుతుండడంతో ఈ ప్రయత్నాలను విరమించుకుని అంత వ్యక్తిగతమే అన్నట్టుగా సరిపడినంత ఖర్చులను ఫోన్ పే చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివారం తెల్లవారుజాముకల్లా పంపిణీ పూర్తిచేయాలని అభ్యర్థులంతా లక్ష్యంగా ఎంచుకున్నారు.



● నూజివీడు నియోజకవర్గంలో 'ఓటుకు నోటు' పంపిణీ ప్రశాంతంగా, బహిరంగంగా జరుగు తోంది. నిన్నటివరకు చిటపటలాడిన ప్రధాన పార్టీలు ఓట్లకు ధర నిర్ణయించే విషయంలో సయోధ్య పాటించినట్టుగా కనబడుతోంది. అసెంబ్లీ, పార్లమెంట్‌కు కలిపి 'ఓటు'కి ఒక్కో పార్టీ రూ. 2 వేల నుంచి రూ.3 వేలు ఇస్తారని భావించిన ఓటర్లకు రెండు పార్టీలు సయోధ్యకు వచ్చి విడి విడిగా చెరో వెయ్యి రూపా యలు చొప్పున ఇస్తూ ఓటర్లకు ఝలక్ ఇచ్చాయి. దెందులూరులో నియోజక వర్గం పెదపాడు మండలంలో అధికార పార్టీ రెండు ఓట్లకు కలిపి రూ.1,500 పంపిణీ చేయగా శనివారం సాయం త్రం నుంచి ప్రతిపక్ష పార్టీలు సైతం రూ.1,500 పంపిణీ చేస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న కొవ్వలి, దెందులూరుతో పాటు పలు గ్రామాల్లో రూ. రెండు వేలు పంపిణీ చేస్తున్నారు. ద్వారకా తిరుమల మండలంలో పట్టపగలే ఓటుకు నోటు పంపిణీ జోరుగా సాగింది. అధికార పార్టీ తరఫున ఓటుకు రూ.2 వేలు, ప్రతిపక్షం వారు రూ.1,500 ఇస్తున్నారు. స్లిప్పులు ఉన్నవాళ్లకే నగదు పంపిణీ చేస్తున్నారని ప్రచారం సాగడంతో స్లిప్పులు తీసుకునేందుకు ఎగబడుతున్నారు. తమకు ఓటు వేసేవారిని గుర్తించి వారికి మాత్రమే డబ్బు పంపిణీ చేసుందుకు ఆయా పార్టీల వారు ఆసక్తి చూపుతు న్నారు. జీలుగుమిల్లి మండలంలో పంచాయతీల వారీగా నాయకులకు నగదు అందజేశారు. ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. తమ పార్టీకి ఓటు వేయని వారికి కొన్ని గ్రామాల్లో నగదు పంపిణీ చేయలేదు. వేలేరుపాడులో ఎన్నికల ప్రచారం ముగియడంతో నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇరుపార్టీలు ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో ఎన్నికల దృష్ట్యా - మిగతా 8లో



స్వేచ్ఛగా ఓటేయండి

- ఎవరు ఆటంకపరచినా సహించం
- ఘర్షణలకు దాడులకు తెగబడితే రౌడీషీట్లే
- రాజకీయ పక్షాలు సహకరించాలి
- ఆంధ్రజ్యోతితో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు, మే 11(ఆంధ్రజ్యోతి) : 'పోలింగ్ ప్రక్రియలో ఎక్కడ ఆటం కం సృష్టించినా ఎవ్వరిని ఉపేక్షిం చేది లేదు. చట్ట పరిధిలో రౌడీ షీట్లు తెరుస్తాం. ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటేయండి, అండగా మేముంటాం. జిల్లాలో ఇప్పటికే కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం' అని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. అవసరమైన చోట పారా మిలటరీ దళా లు గస్తీలో ఉంటాయని ఎప్పటికప్పుడు తాజా పరిస్థితిని సమీక్షించడానికి తాము సిద్ధంగా ఉంటామన్నారు. సోమ వారం ఏలూరు జిల్లావ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా తీసుకున్న ముందస్తు జాగ్రత్త లను శనివారం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆమె ఏమన్నారంటే..

- ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను , పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. ఓటర్లకు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకోవ డానికి వీలుగా ఫ్లాగ్ మార్చ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు, అతి సమస్యాత్మక ప్రాంతాలపై ఖచ్చితంగా నిఘా, బందోబస్తు ఉంటుంది.
- ఎన్నికల ప్రచారం పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులకు వ్యక్తిగత రక్షణ సిబ్బందిని నియమించాం. సంయమనం పాటించేలా రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సూచించాం. శాంతి భద్రలకు మాత్రం విఘాతం కలిగిస్తే ఉపేక్షించం.
- దాడులు, ఘర్షణలు, బెదిరింపులు ఆకతాయి తనంగా వ్యవహరిస్తే ఎవరిని ఉపేక్షించం. రౌడీ షీట్లు తెరుస్తాం. యువత దారితప్పి వ్యవహరిస్తే వారికి భవిష్యత్ ఉండ దు. పూర్తి సమయనం పాటించడం పోలింగ్ ప్రశాం తంగా జరిగేలా సహకరించడం అందరి కర్తవ్యం కావా లి. పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి స్వేచ్ఛగా ఓటు వినియో గించుకోవడానికి అనువైన వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలి. పోలింగ్ ప్రశాంతంగా జరిగి తీరాల్సిందే. ఆ మేరకు అందరూ కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నాం.

పాత పాటే .. అదే క్షోభ

- మండుటెండలో మాడిన జనం
- కైకలూరులో సీఎం సభ.. మళ్లీ తానొస్తేనే పథకాలంటూ ఓటర్లకు ఎర
- చంద్రబాబుపైన, కూటమి మేనిఫెస్టోపైనా నిందలు

ఏలూరు/కైకలూరు, మే 11(ఆంధ్రజ్యోతి) : ఎప్పటి మాదిరిగానే ఈ ఐదేళ్లలో తాను చేసిన పథకాలను ఏకరువు పెట్టారు. లేకలేనన్ని సార్లు బటన్ నొక్కానంటూ గొప్పలు చెప్పుకున్నారు. తాను అమలు చేసిన పథకాలు ఎవరైనా చేస్తారా అంటూ ప్రజల నుంచి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు ప్రలోభాలకు లొంగవద్దంటూ మరీమరీ అభ్యర్థించారు.. ఒక వైపు మండుటెండలో ఎండ మలమల మాడు తుండగా సీఎం జగన్ కైకలూరులో శనివారం జరిపిన ఎన్నికల ప్రచారసభలో అత్యధిక సమ యం పరనిందలకే కేటాయించారు. తన మేని ఫెస్టో అత్యద్భుతమని చెబుతూనే చంద్రబాబు సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ అంటూ వస్తున్నా డని, ఈ ప్రలోభాలకు లొంగవద్దని అభ్యర్థించారు. చంద్రబాబుకు ఓటేస్తే పథ కాలన్నీ ముగింపే నన్నట్టు శాప నార్థాలు పెట్టారు. సాధ్యం కాని హామీలతో ప్రతి పక్షాలు మేనిఫెస్టో తెచ్చిందని, చంద్రబాబును నమ్మవద్దంటూ పదేపదే చెప్పినా జనం నుంచి పెద్దగా స్పందన రాలేదు. అక్క చెల్లెమ్మల ఖాతాల్లో ఈ 59 నెలల కాలంలోనే అనేకసార్లు బటన్ నొక్కి డిపాజిట్ చేశానని.. బటన్ ఇన్నిసార్లు నొక్కడం ఎక్కడైనా జరిగిందా.. అంటూ అదో గొప్పపనిగా అభివర్ణించే ప్రయత్నం చేశారు. గతంలో ఇస్తామన్న రుణమాఫీ, మహాలక్ష్మీ పథకం ఏమయ్యాయని ఇప్పుడేమో ప్రతి ఇంటికి బెంజికారు, కేజీ బంగారం ఇస్తానని చెబితే ఎవరైనా నమ్ముతారా అంటూ ప్రజల నుంచి ఆయన స్పందన ఆశించినా జనం స్పందించలేదు.





సీఎం సభ వద్ద ఎండ తీవ్రతకు షాపుల నీడకు చేరిన జనం.. ప్రసంగిస్తున్న సీఎం జగన్

ఆకట్టుకోని ప్రసంగం

కైకలూరు ప్రచార సభకు సీఎం జగన్ రాక ఆసల్యం అయింది. అప్పటికే సభకు తరలివచ్చిన కార్యకర్తలు మండుటెండను తట్టుకోలేక పక్క చూపులు చూశారు. కొందరైతే పక్కనే వున్న భవ నాల్లోకి చేరారు. కొందరు చెట్ల నీడను ఆశ్రయిం చారు. గ్రామాల నుంచి తీసుకొచ్చిన కార్యకర్తలకు కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై కొందరు ఆగ్ర హించారు. ఎండ మండిపోతోంది పట్టించుకోరా.. అంటూ మహిళలు విసుక్కోవడం విన్పించింది. సీఎం వచ్చి ప్రసంగం ప్రారంభించిన వెంటనే జనం సభా ప్రాంగణం నుంచి వెనక్కి వెళ్లడం కన్పించింది. కొల్లేరు సమస్య - మిగతా 8లో

గెలిపిస్తే మీ గొంతుకనవుతా

ప్రజలకు ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ హామీ



ఏలూరు, మే 11(ఆంధ్రజ్యోతి):'ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న సమయంలో ఎక్కువ ప్రాంతంలో కూటమి పక్షాన ప్రచారం లో పాల్గొన్నా.. అనేక సమస్యలను కళ్ళారా చూశాను.. విన్నాను.. రైతులు పడుతున్న ఇబ్బందులు పోవాలంటే పోలవరం పూర్తికా వాలి.. మెట్ట సమస్య పరిష్కారం కావాలంటే లిఫ్ట పనులను పూర్తిచేయాలి.. వీటి పరిష్కా రానికి తొలి ప్రాధాన్యత.. లోక్‌సభ పరిధిలో ఓటర్లు నన్ను గెలిపించి ఆశీర్వ దిస్తే పార్లమెంట్‌లోనే వీటి గళం విప్పుతా' అంటూ ఏలూరు లోక్‌సభ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ ఐదేళ్లలో రైతులు నష్టపోయారు. ఇబ్బందులు పడ్డారు. సాగునీటి కష్టాలు వెంటాడాయి. స్థానిక సమస్యలు వెన్నాడాయి. వీటి పరిష్కారానికి నడుం బిగిస్తా. ఎప్పుడూ లేనంతగా సమస్యల వలయంలో పడ్డ ప్రజలు ఈసారి కూటమిని గెలిపించుకోవడానికి, లోక్‌సభకు నన్ను ఢిల్లీ పంపించడానికి సంసిద్ధమై ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఓ పరిశ్రమ తేవాలని ఇప్పటికే నిర్ణయించా. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఏడు పరిశ్రమలు వచ్చేలా చేసి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తా. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ఉన్నా. ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాలు నన్ను ఆదరించాయి. కార్మికులు, మధ్య తరగతి వర్గీయులు, రోజువారీ పని చేసే వారంతా కూటమిపై ఎంతో ఆశతో ఉన్నారు. ఇదే సందర్భంలో ఏలూరు లోక్‌సభ స్థానంనుంచి ఎంపీగా తనను, ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించు కోవడానికి కంకణబద్ధులై ఉన్నారు. ఈ తరుణంలో నేను ఇంతకు ముందు మాటిచ్చినట్టుగానే ఏలూరులో మూతపడిన - మిగతా 8లో

పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ, అధికార వైసీపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారంతో సైకిల్ హోరెత్తిపోతోంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన నిమ్మల అధికార పక్షం, ప్రతిపక్షంలో సైతం ప్రజల మన్నన పొందారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటంతో ఆయన ప్రజలకు మరింత చేరువయ్యారు. మరోవైపు వైసీపీ అభ్యర్థి నియోజకవర్గానికి కొత్త. ఎన్నికల ఏడాదిలో ఆయనను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ పార్టీ సీనియర్ నేతల నుంచి సహకారం కొరవడింది. ఎన్నికల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభ్యర్థి సామాజిక వర్గం ఓట్లు గెలిపిస్తాయని నమ్మకంతో ఉన్నారు. కూటమి నుంచి టీడీపీ శ్రేణులతో పాటు నిమ్మల కుటుంబం, జనసేన కార్యకర్తలు నియోజకవర్గం అంతా విస్తృతంగా కలియతిరుగుతున్నారు.

\- పాలకొల్లు అర్బన్

పాలకొల్లు

సైకిల్ హోరు

- హ్యాట్రిక్ దిశగా నిమ్మల
- కలిసివచ్చిన కూటమి శ్రేణులు
- వైసీపీ అభ్యర్థిపై స్థానికేతరుడిగా ముద్ర
- సొంత సామాజికవర్గం ఓట్లపై ఆశలు



నిమ్మల రామానాయుడు



బలాలు..
- రాజకీయంగా గట్టి పునాది
- అన్ని గ్రామాల్లో నాయకులు సహకారం
- క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా పనులు చేయడం
- నిత్యం ప్రజల్లో ఉంటూ అందరివాడుగా గుర్తింపు
- అభివృద్ధి కాముకుడు

బలహీనతలు
- ఆర్థికంగా వెనుకబడి ఉండడం.
- ఎవరికి ఏ పని చెప్పినా వారిపై మరొకరిని నిఘా పెట్టడం

గుడాల గోపి



బలాలు..
- అధికార పార్టీ అండ
- ఆర్థికంగా బలవంతుడు
- సామాజికవర్గం ఓట్లు కురిపిస్తాయన్న ఆశ
- కొత్తగా వచ్చిన వారు సహకారం

బలహీనతలు
- స్థానిక నేతల సహకారం అంతంత మాత్రం
- కులాన్నే నమ్ముకున్నారన్న ప్రచారం
- స్థానికేతరుడు అన్న అంశం.
- కార్యకర్తలకు అందుబాటులో ఉండరు

పాలకొల్లు నియోజకవర్గంలో సైకిల్ హోరెత్తుతోంది. తెలుగుదేశం పార్టీ కూటమి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, అధికార వైసీపీ అభ్యర్థిగా గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. నిమ్మల రామానాయుడు 2014, 2019లో వరుస విజయాలు సాధించి హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతున్నారు. మరోవైపు అధికారపార్టీ అభ్యర్థి గుడాల గోపి విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రాజకీయంగా రాటుదేలిన రామానాయుడు వ్యూహాత్మకంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రతిపక్షంలో ఉండి అనేక విధాలుగా పోరాటం చేస్తున్న రామానాయుడు ప్రజల్లో మమేకం అయ్యారు. 2014లో వచ్చిన మెజార్టీకి మూడింతల మెజార్టీని 2019లో సాధించారు. తిరిగా మూడోసారి మరింత మెజార్టీ సాధించే దిశగా నిమ్మల పావులు కదుపుతున్నారు. అధికార పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీతో జనసేన, బీజేపీ జతకట్టడం వంటి అంశాలు రామానాయుడుకు కలిసివస్తున్నాయి. మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానన్న ధీమా రామానాయుడులో కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లలో 90శాతం టీడీపీ అభ్యర్థికే పడినట్టు ప్రచారం కావడం కూటమి శ్రేణులు మెజారిటీపై లెక్కలు వేస్తున్నారు.

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పది నెలల క్రితం గుడాల గోపిని ఆ పార్టీ ఎంపిక చేసింది. వీరవాసరం మండలానికి చెందిన గోపి స్థానికేతరుడు అంటూ ఆ పార్టీ వారే పెదవి విరిచారు. వీరవాసరం భీమవరం నియోజకవర్గం కావడంతో పాలకొల్లు ప్రజలు కూడా స్థానికేతరుడిగానే చూస్తున్నారు. అభ్యర్థిత్వ రేసులో ఉండడంతో పాలకొల్లు శివారు ప్రాంతానికి నివాసం మార్చి నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రయత్నం చేస్తున్నారు. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు. పాలకొల్లు మండలంలో గుడాల గోపి విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే పెద్ద నాయకులు కొందరు దూరంగా ఉంటున్నారు. తన సామాజికవర్గమే విజయం సాధించి పెడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని గోపి నమ్మకంతో ఉన్నారు. ఈనేపథ్యంలో పాలకొల్లు నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్షాల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. అసెంబ్లీ బరిలో 15 మంది ఉన్నప్పటికీ టీడీపీ, వైసీపీ అభ్యర్థులే ప్రధాన పోటీదారులు. టీడీపీ కూటమి వ్యూహాత్మకంగా దూసుకుపోతుంటే మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అర్జునరావు ప్రచారం నామమాత్రంగా సాగుతోంది. ఇతర పార్టీలు, స్వతంత్రులు నామమాత్రంగా మిగిలారు.

పాలకొల్లు నియోజకవర్గం
పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాలు

మొత్తం ఓటర్లు 1,95,050 మంది
పురుషులు: 95,245 మహిళలు: 98,841
ఇతరులు : 6

అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

1. కొలుకులూరి అర్జునరావు	కాంగ్రెస్
2. ఏలియా కొల్లాబత్తుల	బీఎస్పీ
3. గుడాల శ్రీహరి గోపాలరావు	వైసీపీ
4. నిమ్మల రామానాయుడు	టీడీపీ
5. పోలిశెట్టి శివకృష్ణ	పిరమిడ్
6. బెజవాడ తులసీరావు	జైభారత్
7. అనంత నాగభూషణం	స్వతంత్ర
8. కొటికలపూడి ప్రదీప్	స్వతంత్ర
9. జల్లా వాసు	స్వతంత్ర
10. తానేటి చిన్నఅబ్బులు	స్వతంత్ర
11. తెన్నేటి ప్రసాద్	స్వతంత్ర
12. నల్లి రాజేష్	స్వతంత్ర
13. పాలపర్తి జాన్‌సన్	స్వతంత్ర
14. వసంతాల డివి సురేష్	స్వతంత్ర
15. సలాది శ్రీరామమూర్తి	స్వతంత్ర

పోలవరం

ఉత్కంఠ పోరు

- కూటమి, వైసీపీ హోరాహోరీ
- జనసేన వైపే యువత
- ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు స్థలిలో రాజకీయ పోరాటం

చిర్రి బాలరాజు, జనసేన కూటమి



బలం
- వివాదాలకు దూరంగా ఉండడం
- అణిగిమణిగి ఓర్పుగా పైకి ఎదగడం
- పవన్‌కల్యాణ్ నమ్మకంతో తనను నిలబెట్టారన్న విశ్వాసం
- కీలక నియోజకవర్గంలో తాను ఒక అభ్యర్థిననే ఆత్మవిశ్వాసం
- వైసీపీని ఢీకొనే స్థాయికి చేరడం

బలహీనతలు
- ఆర్థిక వెసులుబాటు లేకపోవడం
- అందరిని సమన్వయపరచడంలో కొన్ని నిర్ణయాలు తీసుకోలేకపోవడం
- ఎవర్నీ నొప్పించని మనస్తత్వం

తెల్లం రాజ్యలక్ష్మి, వైసీపీ



బలం
- భర్త బాలరాజు ఇన్నాళ్లు ఎమ్మెల్యేగా ఉండడం
- గిరిజన మహిళగా పోటీలో నిలుస్తుండడం
- వివాదాలకు దూరంగా మెలగడం
- ఉపాధ్యాయ వృత్తి నుంచి నేరుగా పాలిటిక్స్‌లోకి

బలహీనతలు
- భర్తపై ప్రజల్లో అసంతృప్తి
- ముంపు గ్రామాల్లో సమస్యలు
- నిర్వాసితుల్లో ఆర్అండ్ఆర్ పరిహారంపై ఆగ్రహం
- ప్రభుత్వ వ్యతిరేకత

జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ స్థలిలో రాజకీయ పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి, అధికార పార్టీ వైసీపీ అభ్యర్థుల నడుమ హోరా హోరీ పోరు సాగుతోంది. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకుని జనసేన అభ్యర్థి ప్రచారంలో దూసుకువెళుతున్నారు. యువత మొత్తం జనసేనకు మొగ్గు చూపడం అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది. మరోవైపు వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి భర్త సహకారంతో కార్యరంగంలో దిగారు. ఎమ్మెల్యేగా భర్త అనుభవం ఆమెకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నా నిర్వాసితుల్లో వ్యతిరేకత విజయావకాశాలను ప్రభావితం చేయనుంది. ఎమ్మెల్యేపై ప్రజల్లో సానుకూలత లేకపోవడంతో ఆయన భార్యను వైసీపీ పోటీలో దింపింది. పార్టీ, భర్తపై వ్యతిరేకతను అధిగమించి రాజ్యలక్ష్మి విజయం సాధించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి

పోలవరం నియోజకవర్గంలో రాజకీయ పోరు ఉత్కంఠభరితంగా మారింది. ఒకరిది రాజకీయంగా ఎదిగే వయస్సులో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కిన అదృష్టం. మరొకరు భర్తపై సానుకూలత లేకపోవడంతో ఆయన స్థానంలో దిగిన పరిస్థితి. రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు పొందిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో కొత్త అభ్యర్థులు హోరా హోరీ తలపడుతున్నారు. అధినేత పవన్‌కల్యాణ్ నేరుగా జనసేన తరఫున చిర్రి బాలరాజును పోటీకి దింపడం గమనార్హం. అతిపెద్ద నియోజకవర్గంగా గిరిజన, గిరిజనేతర కుటుంబాలు, సమస్యలకు ఆలవాలమైన ప్రాంతం నుంచే ఎన్నికల రణరంగంలోకి దూకడం ఆయనకు సవాల్ కానుంది. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు కూటమి పక్షాన మిగిలిన పార్టీల నేతలతో ఓపికగా వ్యవహరించడం ప్రతి అంశంలో సమన్వయం, మాట తప్పకుండా, గీత దాటకుండా జాగ్రత్త పడడం, జనసేన ఇచ్చిన వరాన్ని కాపాడుకోవడం ఆయనకు కొత్త పాఠాలే నేర్పింది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం, పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్య, సహాయ పునరావాస ప్యాకేజిలో లోటుపాట్లు ఇంకోవైపు అనేక సమస్యలపై ఎన్నో పోరాటాలు సలిపిన ప్రాంతంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బాలరాజు రంగంలో దిగారు. అందర్నీ సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతూనే ఉన్నారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీతో నేరుగా ఢీకొంటున్నారు. ఆర్థికంగా కొంత వెనుకబాటు అయినా పవన్‌కల్యాణ్ స్ఫూర్తి, కూటమి నేతల సహకారంతో వైసీపీకి కంట్లో నలుసుగా మారారు.

పోలవరం నియోజకవర్గం
పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం మండలాలు

ఓటర్లు : 2,53,981
పురుషులు : 1,22,760
మహిళలు : 1,31,212

అసెంబ్లీ బరిలో అభ్యర్థులు

1. చిర్రి బాలరాజు	జనసేన
2. తెల్లం రాజ్యలక్ష్మి	వైసీపీ
3. దువ్వెల సృజన	కాంగ్రెస్
4. ఎం.వెంకటేశ్వరావు	గోండ్వాన
5. సరియం రామ్మోహన్	సీపీఐ ఎంఎల్
6. మొడియం శ్రీనివాసరావు	ఆదివాసీ
7. మడకం వెంకటేశ్వరావు	బీఎస్పీ
8. మంగమ్మ	యువతరం
9. సరియం సూరమ్మ	స్వతంత్ర
10. బాడిస బుజ్జిదొర	స్వతంత్ర
11. కాక కృష్ణ	స్వతంత్ర
12. ఎం.సూర్యచంద్రరావు	స్వతంత్ర

పోలవరం నియోజకవర్గంలో ఉన్న రాజకీయాలను ఆకలింపు చేసుకుని ముందుకు సాగుతున్నారు. గెలుపు అందుకోవడానికి వీలుగా పావులు కదుపుతున్నారు. బాలరాజుకు కూటమి సమష్టి నాయకత్వమే బలం.

సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సుదీర్ఘకాలం ఇక్కడ ఎమ్మెల్యే. రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం కావడంతో అందరి కన్ను ఇక్కడే. అనేకమార్లు కీలక నేతలు పర్యటనలకు రావడం ఎమ్మెల్యే బాలరాజుకు రాజ్యలక్ష్మికి కలిసొచ్చిన అదృష్టం. ఆయన భార్య, వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఉపాధ్యాయురాలు కావడంతో వివాదాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల సమయం కాబట్టి ఆమె కుల ధ్రువీకరణ వివాదమైంది. తన భర్తను కాదని వైసీపీ అధిష్టానం ఆమెనుద రంగంలోకి దింపినా ఏమాత్రం తత్తరపడకుండా కార్యరంగంలోకి దిగారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో విస్తృతంగా తిరిగారు. గిరిజన కుటుంబాలతో మాటామంతి కలిపారు. ప్రత్యేకించి మహిళల నుంచి ఫ్లస్‌మార్క్ వచ్చేలా జాగ్రత్తలు పడ్డారు. ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే అడుగులు వేయడం రాజ్యలక్ష్మికి కలిసొచ్చినట్లు అయింది. తన భర్త ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో పోలవరం ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజిలో నష్టం వాటిల్లడం, మరికొందరికి అర్హత ఉన్నా జాబితాలో చోటు దక్కకపోవడం వంటి అంశాలు ప్రతికూలమే. ఇలాంటి తరుణంలోనే భర్తకు బదులుగా తాను రంగంలోకి దిగడం, పార్టీపరంగా అసంతృప్తుల నుంచి కూడా సహకారం పొందేందుకు కష్టపడాల్సి వచ్చింది. తన భర్తపై ఉన్న వ్యతిరేకత రాజ్యలక్ష్మికి విజయాన్ని దూరం చేస్తుందా? లేక మహిళా అభ్యర్థిగా చోటు కల్పిస్తుందా? అనేది ఇప్పుడు పోలవరం రాజకీయాల చుట్టూ తిరుగుతోంది.


మై డియర్ ఫస్ట్ టైం ఓటర్..



యువ ఓటర్లకు నారా లోకేశ్ లేఖ

తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు ప్రత్యేక శుభాకాంక్షలు అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లేఖ రాశారు. ఉండి నియోజకవర్గంలోని పలువురు గ్రాడ్యుయేట్లకు శనివారం లేఖలు అందాయి. అమరావతి నుంచి లోకేశ్ యువ ఓటర్ల అడ్రస్‌కు లేఖ రాసి పంపించారు. గ్రామంలో పోస్ట్‌మన్ వీటిని బట్వాడా చేశారు. లేఖ తెరిచి చూసిన యువ ఓటర్లు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు లోకేశ్ నుంచి లెటర్ వచ్చిందని తెలుసుకున్న నూతన ఓటర్లు సంబరపడిపోయారు. లేఖలో లోకేశ్ పలు అంశాలు ప్రస్తావించారు. ఓటు ద్వారా సరైన నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మీ భవిష్యత్‌కు పునాది అని పేర్కొన్నారు. ఐదేళ్లలో యువతకు కలిగిన నష్టాన్ని వివరించారు. ఓటు హక్కు వినియోగించుకుని సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. తమను గుర్తించి శుభాకాంక్షలు తెలిపిన పార్టీకే తమ ఓట్లు వేసి గెలిపిస్తామని నూతన ఓటర్లు పేర్కొన్నారు. లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. **- ఉండి**

నిమ్మలకు 25 వేల మెజారిటీ!



పందెం ఒప్పంద పత్రం

పాలకొల్లులో జోరుగా పందేలు

సిట్టింగ్ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు విజయం సాధించడమే కాదు మెజార్టీపై జోరుగా పందేలు సాగుతున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నిమ్మల ఐదేళ్లలో నియోజక వర్గంలో విశేష అభివృద్ధి చేశారు. 2019లో రాష్ట్రంలో టీడీపీ అధికారం చేజారినప్పటికీ నిమ్మల రెండోసారి అధిక మెజార్టీతో గెలుపొందారు. పార్టీ అధికారంలో లేకపోవడంతో గడచిన ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడింది. ఈ పరిస్థితుల్లో నిమ్మల మూడోసారి కూటమి అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయన గెలుపు సాధ్యమేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు నిమ్మల సాధించే మెజారిటీపై ఆసక్తి నెలకొంది. 25 వేల ఓట్లకు పైబడి మెజార్టీ వస్తుందని, పందేలు సాగాయి. ఈ మేరకు పందెం రాయుళ్లు లిఖితపూర్వక ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ శిబిరంలో నిరాశ, నిస్పృహలు కనిపిస్తున్నాయి.

- పాలకొల్లు

నమ్మకస్తుల కోసం వేట..



ప్రచార గడువు ముగియడంతో నగదు పంపిణీ కీలకం. అత్యంత నమ్మకమైన వారికోసం నాయకులు ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పనిచేసిన వారి గూర్చి ఆరా తీస్తున్నారు. డబ్బులు నొక్కేస్తారనుకున్న వారిని దూరం పెడుతున్నాయి. ప్రాంతాలవారీగా పంపిణీ చేయాల్సిన మొత్తంపై లెక్కలు వేయడంలో తలమునకలుగా ఉన్నారు. ఓటర్లు అందరికి ఒకేతీరిగా కాకుండా కేటగిరిల వారిగా విభజించి పంచాలని వారు భావిస్తున్నట్లు సమాచారం. కచ్చితంగా తమకు అనుకూలం.. డబ్బులిస్తేనే ఓటేస్తారనుకునే వారు.. ప్రత్యర్థిపార్టీ అభ్యర్థికి ఓటువేస్తారనుకునే వారు.. ఇలా ఎవరెవరు ఉంటారనే కోణంలో అభ్యర్థులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పంపిణీ ప్రారంభమైంది. తమ చేతిలో ఇన్ని ఓట్లు ఉన్నాయంటూ బేరాలకు దిగుతున్నారు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో ముఖ్య నేతలు తెలియక తలపట్టుకుంటున్నారు.

ఒట్టు పెట్టి ఓటేయాలి..



ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు నాయకులు జిమ్మిక్కులు చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. వలసవెళ్ళిన ప్రతి కుటుంబాన్ని జిల్లాకు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖ వంటి నగరాల్లో పనిచేసే వారిని ఓట్లు వేసేందుకు పిలుస్తున్నారు. ఇందుకు తగ్గట్లుగా వారికి ప్రయాణ ఖర్చులు అంటూ ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. ఓటువేసిన వారు ప్రమాణం చేస్తే రానుపోను టిక్కెట్లే కాకుండా ఆ రోజు ఇతరత్రా ఖర్చులు కూడా తామే ఇచ్చుకుంటామని చెప్పుకొస్తున్నారు. కొంతమంది మీ డబ్బులు, మీ టిక్కెట్ వద్దు ప్రజాస్వామ్యంగా మా ఓటును వినియోగించుకుంటామని అధికార పార్టీ నేతలకు చెప్పడంతో కంగుతింటున్నారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీకి కూడా తెరతీశారు. **- ఏలూరు రూరల్**

ఓటెవరికేస్తారో..!



పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది ఓటర్లు గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఓటు ఎవరికి వేస్తారో తెలియక నేతలు తలలు పట్టుకుంటున్నారు. అభ్యర్థులు, నాయకులు ప్రచారానికి వచ్చినప్పుడు ఆర్భాటం చేసి అత్యుత్సాహం ప్రదర్శించే కార్యకర్తలు, ఓటర్లు పోలింగ్‌కు సమయం ముంచుకొస్తున్న తరుణంలో పల్లెల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఎవరు ఏ పార్టీకి మొగ్గు చూపుతారో, తమ కెంత మెజార్టీ వస్తుందో కూడ నాయకులు అంచనా వేయడం కష్టమే. ఒక్కో గ్రామం చూస్తే అసలు ఇది ఎన్నికల సమయమేనా అనిపిస్తుంది. ఊళ్లన్నీ గప్‌చుప్‌గా ఉన్నాయి. కార్యకర్తల హడావుడి తప్ప ఓటర్ల నాడి పట్టులేకపోతున్నారు. **- ముదినేపల్లి**

అక్కడ పరిస్థితి ఏంటి..?



ఎన్నికలపై విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రులలో ఆసక్తి నెలకొంది. రాష్ట్రం, సొంత ప్రాంతాల్లో ఎన్నికల పరిస్థితి, జయపజయాలు, ప్రచారాల సరళిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. స్థానికంగా ఉండే కుటుంబ సభ్యులు, బంధులకు రోజూ ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రధానంగా గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్ళిన కార్మికులతో పాటు ప్రవాసాంధ్రుల్లో చర్చనీయాంశమైంది. అమెరికా, జర్మని, నెదర్లాండ్ తదితర దేశాల్లో ఉన్న మన ప్రవాసాంధ్రులు ఇక్కడ జరుగుతున్న ఎన్నికలపై ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారని బంధువులు చెబుతున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచార సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. తమకు అనుకూలమైన అభ్యర్థులకు మద్దతుగా ప్రవాసాంధ్రులు సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు. **- గణపవరం**

వద్దన్నా ఎన్నికల విధులు..
గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సుబ్బరాజు (ఫైల్)

పెరవలి, మే 10: ఎన్నికల విధుల ఒత్తిడి తట్టుకోలేక పెరవలి నెం.1 పాఠశాల ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి గ్రామానికి చెందిన కొలనువాడ సుబ్బరాజు(59) దివ్యాంగుడు. 25 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడికి అధికారులు ఎన్నికల డ్యూటీ వేశారు. తనకు ఆరోగ్యం బాగోలేదని, డ్యూటీ నుంచి మినహాయించాలని జిల్లా అధికారుల చుట్టూ తిరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అభ్యర్థనను జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో ఒత్తిడికి గురై శనివారం గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం సెంటిమెంట్

ఇక్కడ గెలిచిన పార్టీదే అధికారం

పోలవరం నియోజకవర్గంలో ఒక సెంటిమెంట్ ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో 1983 నుంచి ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. 1983 నుంచి 2019 వరకు ఇదే విధానం కొనసాగుతుండడంతో నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పోలవరాన్ని సెంటిమెంట్ భావిస్తారు. 1983లో మొడియం లక్ష్మణరావు టీడీపీ నుంచి గెలుపొందారు. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి బాడిస దుర్గారావు గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. 1994, 1999లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందడంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెల్లం బాలరాజు గెలుపొంది కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటైంది. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా మొడియం శ్రీనివాస్ గెలుపొంది, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2019లో తెల్లం బాలరాజు గెలుపొంది వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో ఎవరు గెలిస్తే ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందని నియోజకవర్గంలో నాయకులు చర్చించుకుంటున్నారు. **- కొయ్యలగూడెం**



ఆహా.. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

జిల్లాలో ప్రయాణించే మహిళలకు ఉచితంగా టికెట్టు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఖరారు చెయ్యనున్నారు. ప్రతీ సభలోను చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణం ఎక్కువగానే ఉంటోంది.ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంది. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, నరసాపురం, కొవ్వూరు, నిడదవోలు డిపోలు ఉన్నాయి. మొత్తం 500 వరకు బస్సులు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. చాలా ప్రాంతాల నుంచి మహిళలు ప్రైవేట్ సంస్థల్లో, ప్రభుత్వం ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ పథకం అమలులోకి వస్తే ఇలాంటి వారందరికీ ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుంది.

-భీమవరం టౌన్

ఈ పథకం..మహిళలకు వరం



మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఒక వరంగా చెప్పవచ్చు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ప్రతీ పథకంలోను మహిళలకు ప్రాధాన్యం కల్పించారు.ఈ పథకం వల్ల పేద మధ్య తరగతి మహిళలకు ప్రయోజనం కలుగుతుంది.

- వేలూరి సీతామహాలక్ష్మి, భీమవరం

చిరు మహిళా ఉద్యోగులకు ఊరట



ఎంతో మంది మహిళలు ప్రైవేట్ సంస్థలల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే పెరిగిన ఛార్జీల కారణంగా దారి ఖర్చులు భారంగా మారాయి. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అలాంటివారికి ఆర్థికంగా ఊరట కలిగిస్తుంది.

- శనగవరపు అన్నపూర్ణ, గునుపూడి

వంటింట్లో సంబరాలు



మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీ మహిళలను విశేషంగా ఆకర్షించింది. ఈ పథకం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మహిళలే చెబుతున్నారు. ఒక చిన్న కుటుంబం అయితే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పొదుపుగా వాడుకుంటే సరిపోతాయి, ఒక వేళ అవసరమైతే ఒకటి , రెండు సిలిండర్లు ఏడాదికి అదనంగా కొనుగోలు చేస్తే సరిపోతుంది.. గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరిగాయి. మొన్నటివరకు రూ.1100 పైగా పెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చేదని, పేద, మధ్య తరగతికి ఇది భారమేనని ఉచిత సిలిండర్ల పథకం వల్ల ఆర్థికంగా చాలా భారం తగ్గుతుందని చెబుతున్నారు. మహిళలు ఈ పథకం పట్ల ఆకర్షితులవు తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్యాస్ వినియోగ దారులు 12.90 లక్షల మంది వరకు ఉన్నారు. ఇవిగాక 6 వేలు వరకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 6.54 లక్షల వరకు ఉండగా ఇవిగాక 3,757 ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ద్వారా వీరందరికీ ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయి.

-ఏలూరు సిటీ

మహిళలకు ఎంతో లబ్ధి



అన్నింటి ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏడాదిలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఇటువంటి పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

- కొడాలి హిమబిందు, ఏలూరు

ఉచిత గ్యాస్‌తో ఆర్థికంగా మేలు



ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్ర బాబు ప్రకటించటం ఆనందంగా ఉంది. మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట. ప్రస్తుతం వంట గ్యాస్ ధరలు పెరుగు తుండటం వల్ల కట్టెల పొయ్యిపైనే వండుకుంటున్నాం.

- కాళ్ళ శ్రీదేవి, ఏలూరు

ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు


జిల్లాకు చేరుకున్న కేంద్ర బలగాలు, నాగాలాండ్, తమిళనాడు పోలీసు బలగాలు



కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారులు

ఏలూరు క్రైం, మే 11 :జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా సాగేందుకు శాంతి భద్రతలు కాపాడేందుకు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ఐపీఎస్ అధికారులను జిల్లాకు ఎన్నికలు పరిశీల కులుగా పంపించింది.వారు ఇప్పటికే జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల పరిస్థితులను అధ్యయనం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన వారంలోనే కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికలు సోమవారం జరగనున్న దృష్ట్యా తమిళనాడు రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా అక్కడ రిజర్వు పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ఇప్పటికే నాగాలాండ్‌కు చెందిన ప్రత్యేక బెటాలియన్లు ప్రతి నియోజకవర్గానికి వచ్చేశాయి. అదనపు బలగాలు శనివారం వేకువ జామున చేరుకున్నాయి. జిల్లాకు వచ్చిన 9 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు శనివారం కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. ఆదివారం ఉదయం ఈవీఎం బాక్స్‌లు తీసుకువెళ్లే ప్రక్రియ నుంచి వాటిని తిరిగి లెక్కింపు కేంద్రాలకు అప్పగించే వరకు నాగాలాండ్ బృందాలతో కట్టుదిట్ట భద్రత చేపట్టారు.

సూపర్‌సిక్స్ పథకాలే సూపర్ అనుకుంటే టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టో అదుర్స్ అంటూ అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేకూర్చేలా పథకాలు ఉన్నాయని అభినందిస్తున్నారు. నూతనోత్సాహం నింపిందని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. పింఛన్లు పెంపు, పేదలందరికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బాలికల విద్యకోసం కలలకు రెక్కలు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించటం వంటి అంశాలపై సంతోషం వ్యక్తమవుతోంది. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో ఇక జగన్ భవిష్యత్తు గల్లంతు అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



బాబు సూపర్ 6 అదుర్స్

టీడీపీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలపై అన్ని వర్గాల్లో ఆనందం

అవ్వా, తాతలకు ఆనందమే

నాలుగు వేల పింఛన్ గ్యారంటీ



ప్రతీ నెలా వచ్చే పింఛన్‌పైనే ఆశలు పెట్టుకున్న అవ్వా తాతలకు కూటమి రూ.4 వేల పింఛన్ ఇస్తుందన్న హామీతో కొండంత బలం పెరిగినట్టయింది. గత ప్రభుత్వం మాదిరిగా ఏడాదికోసారి పెంచి ఇవ్వడం కాకుండా ఏప్రిల్ నెల నుంచే పెంచి ఇస్తానని ప్రకటించారు. దీంతో జూన్ నెలలో రూ.6 వేలు తీసుకునేందుకు ఆనందంగా ఎదురు చూస్తున్నారు. సమాజంలో అణగారిన వర్గంగా ఉన్న బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించే హామీతో 50 ఏళ్ల పైబడిన వారంతా పింఛన్ అందుకుంటామన్న ఆనందంలో కూటమి గెలుపుకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఏనెల పింఛన్ నెలే తీసుకోవాలన్న నిబంధన ఇతర ప్రాంతాల్లో కొడుకు, కూతుళ్ల దగ్గర ఉండే అవ్వా తాతలు, బతుకు తెరువుకోసం పనిచేసేందుకు హైద్రాబాద్ వంటి ప్రాం తాల్లో ఉండే ఒంటరి మహిళలకు ఇబ్బంది కరంగా ఉండేది. కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత ఇలాంటి వారు మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకోవచ్చనే వెసులుబాటు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 లక్షల 34 వేల మంది పింఛన్ దారులు ఉండగా ఉమ్మడి జిల్లాతో కలిపి 5 లక్షల మంది పింఛన్ దారులు ప్రభుత్వం అందించే పించన్ కోసం ఎదురు చూస్తున్నారు.

-తాడేపల్లిగూడెం రూరల్

పింఛనే ఆధారం..



పింఛన్‌తోనే బతుకుతున్నాం. అలాంటిది గత ఎన్నికల్లో మూడు వేలు పింఛన్ పెంచుతానని చెప్పి ఐదేళ్లలో కొంచెం కొంచెం పెంచి మా ఆశలపై జగన్ నీళ్లు చల్లాడు. చంద్రబాబు నాలుగు వేలు పింఛన్ ఏప్రిల్ నుంచే ఇస్తాననడం ఆనందంగా ఉంది.

బి.నరసమ్మ, నందమూరు

కూటమిని నెగ్గించుకుంటాం



పింఛన్లే మాకు జీవనోపాది. ఒక్కసారిగా రూ.4 వేలు అందిస్తాననడం ఆనందంగా ఉంది. కూటమిని నెగ్గించుకునే బాధ్యత మేం తీసుకుంటాం. ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత కూటమి నాయకులు తీసుకోవాలి.

-అడపా రామారావు, తాడేపల్లిగూడెం

సన్న ,చిన్నకారు రైతులకు చేయూత

రైతులకు ఏటా రూ.20 వేలు



ఏడాదికి రూ.20 వేలు రైతన్నలకు అందించాలనే నిర్ణయం రైతులకు చేయుతగా నిలుస్తుంది. సన్న, చిన్నకారు రైతులకు పెట్టుబడులకు ఆసరాగా ఉంటుంది. కౌలు రైతులకు గతంలో మాదిరిగా చేయుతనిచ్చేలా నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి జిల్లాలలో 2 లక్షల పైగా రైతులకు రూ.300 కోట్లు వరకు రైతులు లబ్ధి పొందే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వం హయంలో రైతు భరోసా కింద వైసీపీ ప్రభుత్వం రూ.7500, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు మొత్తం రూ.13,500 ఇచ్చేవారు. తెలుగుదేశం కూటమి ప్రణాళిక ప్రకారం రూ.20 వేలు అందిస్తామని చెప్పడం రైతుల్లో ఒక ధీమాను కలిగిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మకాలు, సాగు పరంగా చాలా ఇబ్బందులు పడ్డామని దీంతో కూటమి పార్టీ కోసం ఎదురు చూస్తున్నామని అంటున్నారు.

- భీమవరం రూరల్

సాగులో పెట్టుబడులకు ఆసరా



వరిసాగులో ప్రస్తుతం చేయుత చాలా అవసరం. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం కూటమి ఏటా రూ.20 వేలు చేయుతగా ఇవ్వాలని నిర్ణయించడం రైతులకు మంచిదే. పెట్టుబడికి రైతులకు చేయూతనిచ్చినట్లవుతుంది.

-కోమటి రాంబాబు, భీమవరం మండలం రైతు

ప్రోత్సాహకరంగా ఉంటుంది



వరిసాగులో రైతన్నలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి కన్నెర్ర కారణంగా సాగులో వెనుకబడ్డారు. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం కూటమి ఏటా రూ.20 వేలు ఇవ్వాలనే నిర్ణయం చాలా మంచిది. సాగులో మరింత ముందుకు సాగించేలా ప్రోత్సాహం అందించినట్టవుతుంది.

- తోట నాగభూషణం, భీమవరం మండలం రైతు

కుటుంబ చదువుకు పూర్తి భరోసా

ఎంతమంది పిల్లలున్నా ఏడాదికి రూ.15 వేలు



తల్లికి వందనం మాట ప్రతీ కుటుంబంలోను చల్లని కబురులా మారింది. కుటుంబంలోని పిల్లలందరికి.. ఒకరు.. ఇద్దరు.. ముగ్గురున్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వనున్నది. ఇది కుటుంబ చదువుకు భరోసాగా నిలుస్తుందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 4 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఏటా రూ.500 కోట్లు రూపాయిలకు పైగా లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ప్రతీ కుటుంబంలోని తల్లితండ్రులకు వారి పిల్లల అందరికి చదువు నిమిత్తం చేయూత లభించిందనే ఆనందం లభిస్తుందని తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలే ఇవ్వడంతో వారిలో నిరుత్సాహం అలముకుంది. ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరికే రావడం తల్లితండ్రులు ఏం చేయాలనే ఆలోచనలో పడేసింది. కూటమి నిర్ణయం ఇప్పుడు పిల్లల చదువుకు భరోసాగా ఉంటుందని అంటున్నారు.

-భీమవరం రూరల్

ఉన్నత చదువులకు ఆసరా



ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలంటే బాగా చదివించాలి. చదువు కోసమే ఇప్పుడు చాలా ఖర్చు అవుతోంది. ఏటా కుటుంబంలోని పిల్లలందరికి రూ.15 వేలు ఇవ్వాలని నిర్ణయించడం మంచి నిర్ణయం. తల్లితండ్రులకు ఇది ఎంతో ఆనందాన్ని ఇచ్చే పథకం.

-పి.నాగేశ్వరరావు, భీమవరం మండలం

ఇది మంచి నిర్ణయం



ప్రతీ పిల్లవాడికి చదువుకు రూ.15 వేలు ఇవ్వడం పిల్లల భవిష్యత్‌కు పునాది వేసినట్లవుతుంది. కుటుంబంలో పిల్లలు అందరూ చదువుకోవాలని తల్లితండ్రులు అనుకుంటారు. అలా చదువుకునే అవకాశం తెలుగుదేశం కూటమి ద్వారా కలుగుతుంది. ఇది మంచి నిర్ణయం.

-ఎల్. ఇస్సాకు, భీమవరం మండలం

యువత భవిష్యత్తు.. బంగారం



కూటమి ప్రభుత్వం ఏర్పడితే యువత జీవితం బంగారమవుతుందని నిరుద్యోగ యువత అభిప్రాయ పడుతు న్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ప్రకటించటం పట్ల యువత సంతోషం వ్యక్తం చేస్తోంది. వారు తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయక పోవడంతో తమ చదువుకి సరిపడా ఉద్యోగం దొరక్క యువత తీవ్ర నిరాశకు గురైంది. ప్రతి ఏడాది ఏలూరు జిల్లాలో డిగ్రీ పాసైన వారు 4,500 మంది ఇంజినీరింగ్ పూర్తిచేసిన 3 వేలమంది బయటకు వస్తున్నారు. బయటకు వచ్చిన అనంతరం వీరిలో కొంతమంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నా మిగతా వారు 40 శాతం మంది ప్రైవేట్ ఉద్యో గాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత తెలుగుదేశం హయాంలో నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం ఉద్యోగ కల్పన అవకాశాలు చేపట్టకపోగా, నిరుద్యోగ భృతికూడా ఇవ్వలేదు. తల్లిదండ్రులకు భారం అవ్వకూడదని చిన్నా చితక ఉద్యోగాలు చేస్తూ ముందుకు సాగు తున్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే తమ విద్యకు తగ్గ ఉద్యోగం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- ఏలూరు రూరల్

గత ప్రభుత్వం మోసం చేసింది



గత ప్రభుత్వం నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరిట మోసం చేసింది. కూటమి మేనిఫెస్టో బావుంది. నిరుద్యోగ యువతకు రూ.3 వేలు భృతి హామీ ఇవ్వడం హర్షణీయం. ఉద్యోగ అవకాశాలు కల్పిం చేలా భరోసా ఇవ్వడం ఆనందమే.

-కటకం మణికంఠ, ఏలూరు

విద్యకు తగ్గ ఉద్యోగం వస్తుందనే నమ్మకం



ప్రభుత్వపరంగా ఉన్నత ఉద్యోగాన్ని ఆశించినా గత ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తీవ్ర నిరు త్సాహానికి గురయ్యాం. టీడీపీ 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిపై హామీ చాలా బావుంది. విద్యకు తగ్గ ఉద్యోగం లభిస్తుందనే నమ్మకం వచ్చింది.

- నాయుడు శ్రీను, నూజివీడు

భవిష్యత్తుపై ఆశలు చిగురించాయి



గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో ఎప్పటికప్పుడు నిరుత్సాహపడ్డాం. చివరికి ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోవాలని అనుకుంటున్నాం. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రకటించడం ఆశాజనకంగా ఉంది.

- వంగమూరి ఆనంద్, మర్రిబంధం, నూజివీడు

దివ్యాంగులకు ఊతం



కూటమి మేనిఫెస్టోపై దివ్యాంగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. రూ.6 వేలు పింఛన్ అందజేస్తామని ప్రకటించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారు. గత టీడీపీ హయాంలో రూ.1500 నుంచి రూ. 3 వేలు పింఛన్ పెంచింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదే రూ.3 వేలు అందజేసిందే తప్ప వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోలేదు. ఏలూరు జిల్లాలో సుమారు మూడు వేలమందికి పైగా దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. ఇంతకు మించి సదుపాయాలు కాని, ఉద్యోగ అవకాశాలు కాని అందించిన పాపాన పోలేదు. కొద్దిమందికి మాత్రమే బ్యాటరీ సైకిళ్ళు, వాహనాలు అందజేశారు. టీడీపీ హయాంలో ప్రతి ఏడాది అర్హులైన అందరికి వీల్ ఛైర్లు, బ్యాటరీ వాహనాలు అందజేశారు. ఉపాధికి చేయూత అందించారు. ప్రస్తుతం మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అందిస్తామని ప్రకటించడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ మేనిఫెస్టో పోలిస్తే అందరికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంది.

- ఏలూరు రూరల్

రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట



కూటమి ప్రభుత్వం ఏర్పడితే యువత జీవితం బంగారమ వుతుంది. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి. ఉపాధి, ఉద్యోగ కల్పన పెరుగుతుంది. గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట మోసం చేసింది. దివ్యాంగులకు రూ.6 వేలు ప్రకటించటం హర్షణీయం. రాష్ట్రాభివృద్ధికి మేనిఫెస్టో పెద్దపీట వేసింది. పూర్ టూ రిచ్ అమలుకు 24 పథకాలను అమలు చేయటానికి సంకల్పించడం, ఉద్యోగాల కల్పన వల్ల గ్రోత్ రేటు పెరుగుతుంది.

- చెల్లా జాకబ్, విభిన్న ప్రతిభావంతుడు

వచ్చేస్తున్నాం..!

ఓట్ల పండుగ కోసం పయనమైన ఎన్ఆర్ఐలు, ఇతర రాష్ట్రాల వాసులు

ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లు

బస్సులు, ట్రైన్ టిక్కెట్లకు డిమాండ్



ఏలూరుసిటీ, మే 11: ఓట్ల పండుగకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉంది. ఇప్పటికే విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు ఓటు వేయడం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విచ్చేశారు. అలాగే హైద్రాబాద్, బెంగుళూరు సిటీలతో పాటు ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న ఈ ప్రాంత వాసులు అక్కడి నుంచి బయలు దేరడంతో టోల్‌గేట్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. వందలాది వాహనాలు ఒకేసారి వస్తుండటంతో ఎక్కడి చూసినా కార్లు, ప్రైవేటు వాహనాలు, ప్రైవేటు బస్సులు, ఆర్టీసీ బస్సుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈనెల 13 వ తేదీన రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవటానికి వారు ఈ ప్రాంతానికి వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వచ్చేవారికోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. అలాగే దక్షిణ మధ్య రైల్వే వారు కూడా ప్రత్యేక రైళ్ళను ఈ ప్రాంతం మీదుగా నడుపుతున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి వస్తున్న ప్రయాణికులతో బస్, ట్రైన్ టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఒక్క సారిగా ప్రైవేటు ఆపరేటర్లు ధరలను కూడా పెంచేశారు. గత రెండు రోజులుగా పెదపాడు టోల్‌గేట్ వద్ద విపరీతమైన రద్దీ పెరిగింది. ముఖ్యంగా శనివారం ఉదయం నుంచి వందలాది వాహనాలు ఈ ప్రాంతానికి వస్తుంటంతో ఎక్కడి కక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోందని చెబుతున్నారు. ఒక్క హైద్రాబాద్‌లోనే లక్షలాది మంది ఓటర్లకు ఈ ప్రాంతంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓట్లు ఉండటంతో వారు తమ ఓటు హక్కు వినియోగించు కోవటానికి విచ్చేస్తున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఓటు వేయటానికి స్వస్థలాలకు రావాలంటూ ఫోన్ల ద్వారా ఆహ్వానాలు పంపారు. అయితే బస్ టిక్కెట్లకు డిమాండ్ విపరీతంగా పెరగటంతో తొలుత ప్రత్యేక బస్‌లు వేద్దామనుకున్న అభ్యర్థులు ఇక్కడికి వస్తే టిక్కెట్ చార్జీలు ఇస్తామని ఆయా ఓటర్లకు ఆఫర్లు ఇచ్చారు. అయితే చాలా మంది ఓటర్లు ఓటుహక్కు తమ బాధ్యత అని తాము స్వచ్ఛందంగా ఓటు వేయటానికి ఈ ప్రాంతం వస్తున్నట్లు చెబుతున్నారు. ఆదివారం బస్‌లు, ట్రైన్‌లకు విపరీతమైన రద్దీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల క్యూ

దీంతో పల్లెలు, పట్టణాలు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లతో సందడిగా కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నాళ్ళ నుంచో విదేశాల్లో ఉన్న ఓటర్లు కూడా ఓటు వేయటానికి ఈ ప్రాంతం రావడం చర్చనీయాంశంగా మారింది. అంటే ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికలు ఎంత కీలకమయినవో అర్థం అవుతోంది.

జాతీయ రహదారిపై రద్దీ

పెదపాడు : ఓటర్లు స్వగామాలను చేరుకునేందుకు పెద్దఎత్తున పయనమవడంతో సోమవారం జాతీయ రహదారిపై కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాల బాట పట్టారు. రైళ్లు, బస్‌లలో టిక్కెట్లు లేక పోవడం, ఉన్నా అధిక రేట్ల కారణంగా సమీప బంధువులు, స్నేహితులు పరస్పర అవగాహనతో గ్రామాలకు వచ్చేందుకు కార్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో రహదారులపై రద్దీ పెరిగింది

పాత పాటే .. అదే క్షోభ

(ఐదో పేజీ తరువాయి)

ప్రస్తావిస్తూ.. సర్వేకు ఎప్పుడో కమిటీని నియమించాం, సర్వే పూర్తికావచ్చింది, నివేదిక అందింది. మిగులు భూములు గుర్తించి పేదలకు పంచాల్సి ఉంది. ఇదంతా నేను తిరిగి అధికారంలోకి వస్తేనే అన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం అందరిని బిత్తరపోయేలా చేసింది. ఇన్నాళ్లు అధికారంలో ఉండి, చేసిందీ ఏమీ లేక ఆఖరి క్షణంలో కొల్లేరు సమస్యకు తానొస్తేనే పరిష్కారమన్నట్టు బేలతనం ప్రదర్శించడం పైనా కొందరు విస్తుపోయారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని ఏలూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీలో కూటమి నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పది మందికి వడదెబ్బ

సీఎం జగన్ సమావేశానికి వచ్చిన ప్రజలతో పది మంది వడదెబ్బకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. ఎండ వేడికి తట్టుకోలేక గాలి తామరకొల్లు గ్రామానికి చెందిన భద్రాజు పార్వతి, కైకలూరుకు చెందిన రఫీయాబేగం, వైవాకకు చెందిన బందెల కోటేశ్వరమ్మ, ఒక మహిళా కానిస్టేబుల్, మరో ఆరుగురు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో ఒకరిని 108లో చికిత్స అందించారు. వీరంతా సాయంత్రం వరకు చికిత్స పొందారు.

నోట్ల పండగ

(ఐదో పేజీ తరువాయి)

జోరుగా డబ్బు, మద్యం పంపిణీ సాగుతోంది. ప్రధాన పార్టీలు ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేస్తున్నారు. ఇండిపెండెంట్, మిగిలిన పార్టీల అభ్యర్థులు మాత్రం పంపిణీకి దూరంగా ఉన్నారు. గణపవరం మండల గ్రామాల్లో ఒక ప్రధాన పార్టీ ఓటరుకు రూ.2వేలు చొప్పున ఇవ్వగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి సైతం రూ.2వేలు చొప్పున ఓటర్లకు అందజేశారు. గ్రామాల్లో పట్టుపగలు పోటాపోటీగా ఈ పంపిణీ జరగడం గమనార్హం. భీమడోలు మండలంలో ఓ పార్టీ అభ్యర్థి రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటర్లకు రూ. రెండు వేలు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల మహిళలకు జాకెట్‌ముక్కలు పంపిణీ చేశారు. అధికార పార్టీ నాయకులు రూ.రెండు వేలు పంపిణీ చేసినప్పటికీ కేవలం తమకు అనుకూల ఓటర్లకు మాత్రమే సొమ్ము పంపిణీ చేశారు. ఉంగుటూరు మండలంలో ఆయా పార్టీల అభ్యర్థులు రూ. రెండు వేలు పంపిణీ చేస్తున్నారు. మూడు రోజులు మద్యం దుకాణాలు మూసివేయనుండడంతో మద్యం దుకాణాలు కిక్కిరిశాయి.

గెలిపిస్తే మీ గొంతుకనవుతా

(ఐదో పేజీ తరువాయి)

జూట్ మిల్లులను తిరిగి తెరిపిస్తా. ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలును నిలిచేలా చూస్తా. పామాయిల్, పొగాకు రైతులను ఆదుకోవడం, తాగు, సాగునీటి పథకాలన్నింటినీ పూర్తి చేయడం, రోడ్ల మరమ్మతు, అభివృద్ధి చేయడం వంటి ప్రాధాన్యతాంశాలన్నింటినీ.. ప్రజలకు ఏదైతే చెప్పానో అదే చేసి, నిరూపించుకుంటా'నని పుట్టా మహేష్ అన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతుల దహనం

ఎన్నికల ప్రచారం మరోగంట వ్యవధిలో ముగియబోతుండగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకే ప్రజలు కోరుకున్నట్టు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ యాక్ట్‌ను రద్దు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే భరోసా ఇవ్వగా, యాక్టు ప్రతులను మీడియా సమావేశంలోనే ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ చించి, చెత్తబుట్టలో వేశారు. ఈ చట్టం ప్రజా వ్యతిరేకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని, ఇది ప్రజా నిర్ణయమని చెప్పారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 11: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలని , ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం రాత్రి ఆర్వోలు, తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులు సమకూర్చామని పేర్కొన్నారు. అధికారులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని , ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పోలింగ్ ఏజెంట్లు నియామకానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థి నుంచి లిఖిత పూర్వక లేఖను ఆయా పీఓలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఆర్వోలు జాగ్రత్త వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ రెండు రోజులు చాలా కీలకమని అందరు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి అల్పాహారం ,భోజన సదుపాయాలు ఎటువంటి లోపంలేకుండా సమయానికి అందేలా చూడాలన్నారు.

రేపు సెలవు

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఈ నెల 13న ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో గల అన్ని కార్యాలయాలకు సోమవారం లోకల్ హాలీడే ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఖజానా, ఉపఖజానా వారి కార్యాలయాలు, అత్యవసర సేవలు విభాగాలు మినహాయించబడతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రం...భక్త జనమయం

శ్రీవారిని దర్శించిన కమలానంద భారతీస్వామి



ద్వారకాతిరుమల, మే11: ద్వారకాతిరుమల చిన్నతిరుమల క్షేత్రానికి శనివారం దాదాపు 20 వేలకు పైబడి యాత్రికులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భక్తజనులతో సందడిగా మారాయి. ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది. చినవెంకన్న ఆలయాన్ని గన్నవరంలోని భువనేశ్వరీ పీఠం కమలానంద భారతి స్వామి శనివారం ఉదయం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు మర్యాద పూర్వక ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

అవినీతి పాలనకు చమరగీతం పాడాలి

టి.నరసాపురం మే 11 : రాష్ట్రంలో అవినీతి పాలనకు చమరగీతం పాడాలని దక్షిణ భారత కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము అన్నారు. టి.నరసాపురంలో మాజీ సర్పంచ్ జోనుబోయిన సోంబాబు అధ్యక్షతన టీడీపీ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాము మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు తెచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు చెల్లించే పరిస్థితి లేదని విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేదు, పరిశ్రమలు రాక అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. ఇసుక దోపిడి యద్ధేచ్ఛగా సాగుతోందని ధ్వజమెత్తారు. ఎన్‌డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అవినీతి రహిత పాలన కోసం పోలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజు ఎన్నికల గుర్తు గాజుగ్లాసు పై, టీడీసీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌కు సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిన సత్యనారాయణ, గంధం ముత్తయ్య, దేవరపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్థో వైద్యశిబిరం

ఏలూరు రూరల్, మే 11: ఆర్ఆర్‌పేటలోని శ్రీకృష్ణా ఆర్థో ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకృష్ణ సుమారు 200 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే బోన్ డెన్సిటీ, ఎక్స్‌రే, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆసుపత్రిని స్థాపించి పదేళ్ళు పూర్తి అయిన సందర్భంగా ప్రతి నెల రెండో శనివారం ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



పోలింగ్ సామగ్రి పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి ఖాజావలి

బుట్టాయగూడెం/ఉంగుటూరు మే 11: ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో నియోకవర్గంలోని రెండు లక్షల 53 వేల 981 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,22,760, మహిళలు 1,31,212 మంది ట్రాన్స్‌జెండర్స్ 9 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందుకు గాను 284 పోలింగ్ కేంద్రాలు, 1,070 సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్నట్లు తెలిపారు. 90 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ముందు జాగ్రత్త చర్యగా అదనపు బలగాలను పోలింగ్ కేంద్రాలను వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోసం 76 ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఏఆర్వో ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియకు సర్వం సన్నద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పోలింగ్ స్టేషన్లకు సుమారు రెండు వేల మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ప్రచార ర్యాలీ



ధర్మరాజు స్వాగతం పలుకుతున్న మహిళలు



పత్సమట్ల ధర్మరాజు ప్రచార ర్యాలీ

నిడమర్రు మే 11 : బ్యాలెట్‌లో నాలుగో నెంబరు కూటమి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు గాజు గ్లాసు గుర్తుకు, ఎంపీ అభ్యర్థి నాలుగో నెంబరుకు పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఉంగుటూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఎన్నికల ప్రచారం చివరి రోజున శనివారం భువ్వనపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భముగా మహిళలు పెద్దఎత్తున పూలమాలలతో ఆయనకు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన జరుగుతుందన్నారు. తోకలపల్లి , బైనేపల్లి, ఆముదాలపల్లి,ఘత్తేపురం, దేవరగోపవరం, పెదనింద్రకొలను గ్రామాలలో పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మోటారు సైకిళ్ళతో కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

రోషన్‌కుమార్ సతీమణి విజయ ప్రచారం



పాతిమాపురంలో ప్రచారం చేస్తున్న విజయ

చింతలపూడి, మే 11 : మహిళలు ఓటు విలువ గుర్తించి, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని చింతలపూడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సతీమణి సొంగా విజయ అన్నారు. పాతిమాపురంలో శనివారం ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. మహిళలకు సూపర్ సిక్స్ పథకాలను వివరిం చారు. కూటమి అసెంబ్లీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను, పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట పి.వెంకట్రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పట్టణంలో తిరిగిన సొంగా రోషన్

సొంగా రోషన్‌కుమార్ చింతలపూడి శనివారం రాత్రి పట్టణంలో కొద్దిసేపు దుకాణాల దారి వెంట నడుస్తూ పలువుర్ని పలుకరించారు. హోటల్లో టీ తాగి ముచ్చటించారు. అక్కడి ఉండి నడుచుకుంటూ ప్రతిఒక్కర్ని పలుకరించుకుంటూ దుకాణదారుల్ని కూటమి ప్రభుత్వాన్ని తీసుకురావాలని, చింతలపూడిలో మెయిన్‌రోడ్డు పై సెంట్రల్ లైటింగ్ వెలగటం లేదని, తాము వస్తే 100 రోజుల్లోనే వెలిగిస్తానని అక్కడి చేరిన ప్రజలకు విద్యుత్ స్తంభాలను చూపుతూ హామీ ఇచ్చారు.



జీవో కాపీలను తగులబెడుతున్న టీడీపీ నేతలు

ల్యాండ్ టైటిల్ జీవో కాపీ దగ్ధం

లింగపాలెం, మే 11: ధర్మాజిగూడెంలో టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని కాపు నేతలతో సమావేశమయ్యారు. కాపు నేతలంతా తెలుగుదేశంపార్టీకి మద్ధతుగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రైతులకు ఉరికొయ్యగా మారుతుందని అన్నారు. రైతుల భూములను లాక్కునే విధంగా ఈ చట్టం రూపొందించాడని, చిన్న, సన్నకారు రైతుల నుంచి వారి భూములను లాక్కునే ప్రయత్నంలో ఈ చట్టం తెచ్చిందని అన్నారు. అనంతరం ల్యాండ్ టైటిల్ జీవో కాపీలను దగ్ధం చేశారు. గారపాటి బుజ్జియ్య, మోరంపూడి ప్రసాద్, రాయంకుల చక్రధర్‌రావు, జనసేన, బీజేపీ, తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలను దోచుకుంటున్న సీఎం జగన్

పెదపాడు, మే 11 : సంక్షేమం పేరుతో జగన్ పేదలను నిలువునా దోపిడీ చేస్తున్నారని, ఇది ఆగాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో వైఫల్యాలు, మోసాలను గుర్తించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి జరుగుతుందనే పార్టీలో చేరాం

పెదవేగి, మే 11 : టీడీపీ మంచి చేస్తుందనే నమ్మకం కలిగే ఆ పార్టీలో చేరామని జానంపేటలోని శాలివాహన సంఘం నాయకులు తెలిపారు. గ్రామ శాలివాహన సంఘం అధ్యక్షుడు జీడిమళ్ళ నారాయణరావు ఆధ్వర్యంలో సంఘానికి చెందిన 25 కుటుంబాల వారు చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం జరిగిన



శాలివాహన సంఘం నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభాకర్

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభాకర్.. శాలివాహన సంఘం నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఐదేళ్ళ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు ఏమీ కనిపించలేదని, ఈ పరిస్థితిలో వైసీపీకంటే టీడీపీ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందనే నమ్మకం ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు. బొప్పన సుధాకర్, కమ్మ శివరామకృష్ణ, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, నర్ని జయబాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే పల్లెల అభివృద్ధి

జనసేనలో చేరిన వివిధ సంఘాల నేతలు



కార్యకర్తలకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మరాజు

గణపవరం, మే 11: పల్లెల అభివృద్ధి జనసేన కూటమితోనే సాధ్యమని జరగనున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరంలో స్వర్ణకారులు, విశ్వబ్రహ్మణులు 60 మందికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ఆరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామంలో మహిళలు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పార్టీలో చేరుతున్నారని తనకు గ్లాస్ గుర్తుకు, పుట్టా మహేష్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, యాళ్ల సుబ్బారావు, అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, తోట శ్రీనివాసరావు, వాసురాజు, కూసంపూడి జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల సందడి



గణపవరం, మే 11: పార్టీలు పంపిణీ చేసిన నగదు అందిన వెంటనే మందు బాబులు మద్యం దుకాణాల వద్ద క్యూకట్టారు. ఎన్నికల నేపథ్యంలో రేపటి నుంచి మద్యం దుకాణాలు మూసి వేస్తుండడంతో ఉదయం నుంచి రద్దీ నెలకొంది. మూడు రోజులకు కావాలని మద్యం కొనుగోలు చేశారు. దుకాణాల్లో అమ్మాల్సిన కోటా మద్యం మధ్యాహ్నం 12 గంటలకే పూర్తయింది. దీంతో మద్యం కావాలంటే బ్లాక్ మార్కెట్‌లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

ప్రచారం పరి సమాప్తం

కొయ్యలగూడెం/ చింతలపూడి/ ఉంగుటూరు మే 11: ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. దీంతో ఆయా పార్టీల నేతలు ఇంటింటికీ వెళ్ళి తమ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బొట్టు పెట్టి కూటమి అభ్యర్థులైన చిర్రి బాలరాజు గ్లాసు గుర్తుకు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా కన్నాపురం గ్రామంలో చిన్నారులు సైతం ప్రచారంలో పాల్గొంటూ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారాలు హోరెత్తించారు. చింతలపూడి మండలంలో డీజే సౌండ్లు, డిజిటల్ టీవీ మోటారు వాహనాలు, మోటారు సైకిళ్ళ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు, మైక్‌ల హోరు వీటికి తెరపడటంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోనూ, పట్టణాల్లో నోట్లు జోరుగా పంపిణీ జరుగుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున ప్రచారం జరపగా చిన్న పార్టీలు కేవలం ఆటోలతో ప్రచారం జరపడం విశేషం. గ్రామాలల్లోను సమస్యాత్మక గ్రామాలలో సీఆర్పీఎఫ్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

కూటమి గెలుపుతోనే యువతకు భవిష్యత్

చింతలపూడి, మే 11: ఐదేళ్ళల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో యువత భవిత నిర్వీర్యమైందని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. చింతలపూడి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయలేదని, ఖాళీగా ఉన్న రెండు లక్షల 32 వేల ఉద్యోగాలు, 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. యూనివర్శిటీ ఉద్యోగాలు భర్తీ చేయలేదని, స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వీర్యం అయిందని, ఈ కారణాలతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య 26 శాతం నమోదు అయిందన్నారు. అయితే గత తెలుగుదేశం హయాంలో వాణిజ్య సదస్సుల ద్వారా కియా మోటార్స్, హీరో మోటార్స్, అపోలో టైర్స్ వంటి పలు పరిశ్రమలు తెచ్చి చంద్రబాబు ఐదు లక్షల 20 వేల మందికి ఉపాధి కల్పన చూపించారన్నారు. యువత ప్రధానంగా ఎవరి వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయో గ్రహించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించటమే యువత తన లక్ష్యంగా సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీ, బలమైన ప్రభుత్వం తీసుకురావాలని, అందుకు ఇది సరైన సమయమని, ప్రలోభాలకు లొంగకుండా భవిష్యత్తును కాపాడుకునే విధంగా ఓటు వేయటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

వైసీపీని ఓడించండి

సర్పంచ్‌లకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం పిలుపు



ఏలూరు రూరల్, మే 11: సర్పంచ్‌లందరూ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు కడలి గోపాలరావు మాట్లాడుతూ వైసీపీ హయాంలో చేసిన పనులకు పంచాయతీలకు నిధులు రాక చేసిన అప్పులు తీరక సర్పంచ్‌లు గడ్డుకాలం ఎదుర్కొన్నారన్నారు. సర్కార్ వైఖరితో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయామని, కనీసం ప్రజల ముందు తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు పంచాయతీకి ఇవ్వలేదన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు పిల్లి సత్యరాజు మాట్లాడుతూ సర్పంచ్‌లకు రావాల్సిన 14,15 ఆర్థిక సంఘం నిధులు సర్పంచ్‌ల అకౌంట్లో పడకుండా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య వంటి పనులు చేసే స్థితిలో తాము లేమన్నారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటూ కూటమి అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తాం

ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి



సమావేశంలో మాట్లాడుతున్న బడేటి చంటి



ర్యాలీ నిర్వహిస్తున్న కూటమినేతలు

ఏలూరు టూ టౌన్, మే 11: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ఆ వెంటనే భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ఈ రాక్షస పాలన అంతరించిపోవాలన్నారు. ఇవి ప్రజల తలరాతను మార్చే ఎన్నికలన్నారు. ఈ ఎన్నికల్లో అంతిమంగా ప్రజలు గెలవాలని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. భూహక్కు చట్టాన్ని అడ్డుపెట్టుకు ని మన ఆస్తుల్ని జగన్ తాకట్టుపెట్టుకోవడమే కాకుండా వాటిని అమ్ముకోవడానికి కూడా సిద్ధపడతాడన్నారు. జూన్ నాలుగు తరు వాత చంద్ర బాబు ముఖ్యమంత్రి అవ్వగానే భూహక్కు చట్టం పై రెండో సంతకం చేస్తారని అన్నారు. భూహక్కు చట్టం పత్రాలను చించివేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కూటమి విజయాన్ని కోరుతూ ర్యాలీ

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బడేటి చంటి, పుట్టా మహేష్ యాదవ్‌ల విజయాన్ని కోరుతూ నగరంలో భారీ మోటార్‌సైకిళ్ళ ర్యాలీ నిర్వహించారు. కాపు సంక్షేమ సంఘం నాయకులు పులి శ్రీరాములు, ఎం.చంద్రశేఖర్, సతీష్ నాయుడు, జగన్మోహన్‌రావు, నవీన్‌కుమార్, రమేష్, నారాయణమూర్తి, ఆర్.రామకృష్ణ, అరవింద్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక బస్సులు

ఏలూరు రూరల్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు బస్టాండు నుంచి చింతలపూడి, కైకలూరు, నూజివీడు, ఉంగుటూరు అలాగే పెదవేగి, రంగాపురం బయలుదేరి వెళతాయన్నారు. అలాగే పెదపాడు పరిధిలో ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం బస్‌స్టేషన్ నుంచి చింతలపూడి, ఏలూరు, పోలవరం, నూజివీడు బస్‌స్టేషన్ నుంచి చింతలపూడి, కైకలూరు, ఉంగుటూరు, ముసునూరు, చాట్రాయి నుంచి నూజివీడు, ఏలూరు, ఆగిరిపల్లి నుంచి నూజివీడు, ఏలూరు, ధర్మాజిగూడెం నుంచి చింతలపూడి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. అలాగే రెగ్యులర్ బస్సులు ఏలూరు బస్‌స్టేషన్ నుంచి జంగారెడ్డిగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం బస్‌స్టేషన్ నుంచి నూజివీడు, నూజివీడు బస్‌స్టేషన్ నుంచి జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం కలిదిండి నుంచి కైకలూరు, ఏలూరు, ముదినేపల్లి నుంచి మండవల్లి, కైకలూరు, ఏలూరు, పోలవరం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, ద్వారకా తిరుమల నుంచి దెందులూరు, ఏలూరు, చింతలపూడి నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడుకు బస్సులు నడుస్తాయన్నారు. పోలింగ్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సికింద్రాబాద్ - విశాఖపట్టణం మధ్య ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, మే 11 : వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ - విశాఖపట్టణానికి ప్రత్యేక రైలును ఈ నెల 12, 13 తేదీల్లో నడుపుతుంది. రైలు నెంబర్ 07097 సికింద్రాబాద్‌లో 12వ తేదీ ఆదివారం ఉదయం రాత్రి 7.45కు బయలుదేరి 13వతేదీ ఉదయం 6.30 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07098 విశాఖపట్టణంలో ఈ నెల 13వ తేదీ సోమవారం రాత్రి 7.50 నిముషాలకు బయలుదేరి మరుసటి రోజు 8.15 నిముషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రెండు సర్వీసులు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, విశాఖపట్టణం రైల్వే స్టేషన్లలో ఆగుతాయని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే వేసవిలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నడుస్తున్న రైళ్ళల్లో తాత్కాలికంగా అదనపు బోగీలు ఏర్పాటు చేశామని దక్షిణమధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ఏలూరు మీదుగా నడుస్తున్న రైళ్ళు అయిన 12740 సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం, 12735 విశాఖపట్టణం- సికింద్రాబాద్, 22204 సికింద్రాబాద్ - విశాఖపట్టణం, 22203 విశాఖపట్టణం - సికింద్రాబాద్ రైళ్ళల్లో త్రి టైర్ ఏసీ ఒక్కో కోచ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 17239 గుంటూరు - విశాఖపట్టణం, 17240 విశాఖపట్టణం- గుంటూరు వెళ్ళే రైళ్ళల్లో జనరల్ కోచ్ ఒకటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు

క్రైం వార్తలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మే 11 : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రామిలేరు బ్రిడ్జి పైనుంచి గుర్తు తెలియని వ్యక్తి కిందపడి మృతి చెందాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 30 ఏళ్ళ వయస్సు కల్గి 5.6 అడుగులు ఎత్తు, సామాన్య దేహదారుఢ్యంతో ఉన్నాడు. ఆకుపచ్చరంగు పొట్టి చేతుల టీషర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని ఎడమ చేతి మోచేతి కింద మమ్మి అనే ఇంగ్లీషు అక్షరంలో పచ్చబొట్టు, కుడిచేతి మోచేతి కింద పాపున్ అనే ఇంగ్లీషు అక్షరాలతో పచ్చబొట్టు ఉంది. కుడిచేతికి జగన్ కోసం సిద్ధం అను నీలం రంగు చేతి బ్యాండ్ ఉంది. ఇవి తప్ప ఎలాంటి ఆధారాలు లేవు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పోలవరం, మే 11 : ఎస్ఈబీ సిబ్బంది దాడుల్లో 63 అక్రమ మద్యం బాటిళ్లు కలిగిన ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్టు ఎస్ఈబీ ఎస్ఐ కె.వీరబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11 వరకూ 72 కేసుల్లో 67 మందిపై కేసులు నమోదు చేసి 460 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 13,100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు, 338.32 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఏలూరు క్రైం, మే 11 : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలను గుర్తించారు. సారా తయారీ, విక్రయదారులపై నాలుగు కేసులు నమోదు చేసి వారి నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మూడు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కలిగి ఉన్నవారిపై 8 కేసులు నమోదు చేసి 58.58 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 13 కేసులలో 10 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. ఆరు ప్రాంతాల్లో కార్డెన్‌వర్క్ నిర్వహించి ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



ఏలూరు క్రైం, మే 11 : ఈ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. సారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వివిధ నగరాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. లాడ్జీల్లో బస చేసిన వారి గుర్తింపు కార్డులను పరిశీలించి వారు ఎందు నిమిత్తం లాడ్జీలో బస చేశారో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళ సాయుధ బలగాలతో ప్లాగ్‌మార్చ్‌ని నిర్వహించారు.

పాత పాటే .. అదే క్షోభ

(ఐదో పేజీ తరువాయి)

ప్రస్తావిస్తూ... సర్వేకు ఎప్పుడో కమిటీని నియమించాం, సర్వే పూర్తికా వచ్చింది, నివేదిక అందింది. మిగులు భూములు గుర్తించి పేదలకు పంచాల్సి ఉంది. ఇదంతా నేను తిరిగి అధికారంలోకి వస్తేనే అన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం అందరిని బిత్తరపోయేలా చేసింది. ఇన్నాళ్లు అధికారంలో ఉండి, చేసిందీ ఏమీ లేక ఆఖరి క్షణంలో కొల్లేరు సమస్యకు తానొస్తేనే పరిష్కార మన్నట్టు బేలతనం ప్రదర్శించడం పైనా కొందరు విస్తుపోయారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని ఏలూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. కైకలూరు ఎమ్మెల్యే, అభ్యర్థి దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీలో కూటమి నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పది మందికి వడదెబ్బ

సీఎం జగన్ సమావేశానికి వచ్చిన ప్రజలతో పది మంది వడదెబ్బకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. ఎండ వేడికి తట్టుకోలేక గాలి తామర కొల్లు గ్రామానికి చెందిన భత్రాజు పార్వతి, కైకలూరుకు చెందిన రఫీయాబేగం, వైవాకకు చెందిన బందెల కోటేశ్వరమ్మ, ఒక మహిళా కానిస్టేబుల్, మరో ఆరుగురు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో ఒకరిని 108లో చికిత్స అందించారు. వీరంతా సాయంత్రం వరకు చికిత్స పొందారు.

నోట్ల పండగ

(ఐదో పేజీ తరువాయి)

జోరుగా డబ్బు, మద్యం పంపిణీ సాగుతోంది. ప్రధాన పార్టీలు ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేస్తున్నారు. ఇండిపెండెంట్, మిగిలిన పార్టీల అభ్యర్థులు మాత్రం పంపిణీకి దూరంగా ఉన్నారు. గణపవరం మండల గ్రామాల్లో ఒక ప్రధాన పార్టీ ఓటరుకు రూ.2వేలు చొప్పున ఇవ్వగా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి సైతం రూ.2వేలు చొప్పున ఓటర్లకు అందజేశారు. గ్రామాల్లో పట్టపగలు పోటాపోటీగా ఈ పంపిణీ జరగడం గమనార్హం. భీమడోలు మండలంలో ఓ పార్టీ అభ్యర్థి రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటర్లకు రూ. రెండు వేలు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల మహిళలకు జాకెట్‌ముక్కలు పంపిణీ చేశారు. అధికార పార్టీ నాయకులు రూ.రెండు వేలు పంపిణీ చేసినప్పటికీ కేవలం తమకు అనుకూల ఓటర్లకు మాత్రమే సొమ్ము పంపిణీ చేశారు. ఉంగుటూరు మండలంలో ఆయా పార్టీల అభ్యర్థులు రూ. రెండు వేలు పంపిణీ చేస్తున్నారు. మూడు రోజులు మద్యం దుకాణాలు మూసివేయనుండడంతో మద్యం దుకాణాలు కిక్కిరిశాయి.

గెలిపిస్తే మీ గొంతునవుతా

(ఐదో పేజీ తరువాయి)

జూట్ మిల్లులను తిరిగి తెరిపిస్తా. ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలును నిలిచేలా చూస్తా. పామాయిల్, పొగాకు రైతులను ఆదుకోవడం, తాగు, సాగునీటి పథకాలన్నింటిని పూర్తి చేయడం, రోడ్ల మరమ్మతు, అభివృద్ధి చేయడం వంటి ప్రాధాన్యతాంశాలన్నింటినీ.. ప్రజలకు ఏదైతే చెప్పానో అదే చేసి, నిరూపించుకుంటా'నని పుట్టా మహేష్ అన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతుల దహనం

ఎన్నికల ప్రచారం మరో గంట వ్యవధిలో ముగియబోతుండగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకే ప్రజలు కోరుకున్నట్టు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ యాక్ట్‌ను రద్దు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే భరోసా ఇవ్వగా, యాక్టు ప్రతులను మీడియా సమావేశంలోనే ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ చించి, చెత్తబుట్టలో వేశారు. ఈ చట్టం ప్రజా వ్యతిరేకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని, ఇది ప్రజా నిర్ణయమని చెప్పారు.

తగ్గేదేలే...



నూజివీడు, మే 11: నూజివీడు నియోజకవర్గంలో ఓటర్లకు డబ్బు పంపిణీ ప్రశాంతంగా, బహిరంగంగా జరుగుతోంది. టీడీపీ, వైసీపీలు ఓట్లకు ధర నిర్ణయించే విషయంలో సయోధ్య పాటించినట్లుగా కనబడుతోంది. అసెంబ్లీ, పార్లమెంట్‌కు కలిపి 'ఓటు'కి ఒక్కో పార్టీ 2 నుంచి 3 వేలు పంపిణీ చేస్తుందని భావించిన ఓటర్లకు రెండు పార్టీలు సయోధ్యకు వచ్చి విడివిడిగా వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ జరుపుతూ ఓటర్లకు జలక్ ఇచ్చాయి. నియోజక వర్గంలోని నూజివీడు పట్టణం, నూజివీడు రూరల్, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లో పంపిణీ ప్రారంభం అయింది. చాట్రాయి మండలంలోని చీపురుగూడెం గ్రామంలో ఓటుకు 1500 రూపాయలు వైసీపీ పంపిణీ చేయగా, టీడీపీ శ్రేణులు కూడా 1500 రూపాయలు పంచాల్సిందేనని అభ్యర్థికి చెప్పి పంపిణీ చేయించాయి. మిగిలిన నియోజకవర్గంలోని గ్రామాల్లో 1000 రూపాయలు చొప్పున పంపిణీ జరుగుతోంది. నూజివీడు పట్టణంలో మాత్రం రెండు ప్రధాన పార్టీలు 1500 రూపాయలు చొప్పున పంపిణీ జరుపుతున్నారు. ఈ నియోజకవర్గాలలో ఫలితాన్ని నిర్ణయించేది నూజివీడు పట్టణం, చాట్రాయి మండలంలోని ఓటర్లే. గతంలో కూడా ఇలా ఒకే ధర నిర్ణయించి తొలుత ఈ రెండు పార్టీలు పంపిణీ చేసినా, ఒక పార్టీ మాత్రం భిన్నంగా, కీలక గ్రామాలు, నూజివీడు పట్టణంలో ఒప్పందానికి మించి రహస్యంగా రెండో విడత నోట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అలా జరిగే అవకాశం ఉండటంతో అవసరం అయితే రెండో విడత పంచడానికి ఎవరి జాగ్రత్తలో వారు ఉన్నారు. మద్యం సరఫరా కూడా జోరుగా సాగుతోంది.

టీడీపీ వైపు.. యువత చూపు

నూజివీడు టౌన్, మే 11: తెలుగుదేశంపార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిని 3 వేలు ఇస్తామంటూ హామీ ఇవ్వడంతో యువత తెలుగుదేశం పార్టీవైపు ఆకర్షితులు అవుతున్నారు. గత ఐదు సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడంతో తమ చదువుకి తగిన ఉద్యోగం దొరక్క యువత ప్రభుత్వ తీరుతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కాంపిటీటివ్ పరీక్షలతో తల్లిదండ్రులకు భారం అవ్వకూడదని చిన్నాచితక ఉద్యోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నా అటు ఉద్యోగాలు, ఇటు కాంపిటీటివ్ పరీక్షలకు సక్రమంగా శిక్షణ పొందలేక ఇబ్బందిపడ్డామని నిరుద్యోగ భృతితో కాంపిటీటివ్ పరీక్షలకు తయారు అవ్వడంతో పాటు తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక, 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ ఇవ్వడంతో తమ విద్యకు తగ్గ ఉద్యోగం లభిస్తుందనే ఆశాభావాన్ని నూజివీడు నియోజకవర్గ యువత వ్యక్తం చేస్తోంది.

ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది



సామాన్య కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించా. ప్రభుత్వపరంగా ఉన్నత ఉద్యోగాన్ని ఆశించినా గత ఐదేళ్లుగా జాబ్ క్యాలెం డర్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాం. టీడీపీ 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిపై హామీ చాలా బావుంది.

-నాయుడు శ్రీను, నూజివీడు

ఆశాజనకంగా నిరుద్యోగ భృతి



వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడంతో నిరుత్సాహపడ్డాం. ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోవాలని అనుకుంటున్న క్రమంలో వైసీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి రూ. 3 వేలు, 20 లక్షల ఉద్యోగాల కల్పనను ప్రకటించటం ఆశాజనకంగా ఉంది.

-వంగమూరి ఆనంద్, మర్రిబంధం, నూజివీడు మండలం

ఎన్నికల స్నాప్

డమ్మీ ఈవీఎంతో ప్రచారం



పోటీలో ఉన్న అభ్యర్థుల పేరు, ఎన్నికల గుర్తు, వరుస క్రమం తెలియజేస్తూ ఆయా పార్టీల నేతలు నమూనా బ్యాలెట్‌తో ప్రచారం చేసే వారు. ప్రస్తుతం ఈవీఎంలో బటన్ నొక్కడు గురించి కూడా ఓటర్లకు చెప్పాలి కదా. అందుకే నమూనా బ్యాలెట్‌తో పాటు డమ్మీ ఈవీఎంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కలిదిండి మండలం కోరుకొల్లులో కూటమి నాయకులు డమ్మీ ఈవీఎంలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈవీఎంలో కమలం, సైకిల్ గుర్తులను ఓట ర్లకు చూపుతూ అవగాహన కల్పించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. బట్టు లీలా కనకదుర్గ, నున్న సుబ్రహ్మణ్యం, రమేష్, బలరామ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. - కలిదిండి

సీఎం వస్తే అంతే మరి!

- కైకలూరు ప్రజలకు కరెంట్ కష్టాలు..
- దారి మళ్లింపుతో వాహనచోదకుల పాట్లు

కైకలూరు, మే 11: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి బహిరంగ సభ కోసం కైకలూరులో విద్యుత్, కేబుల్ వైర్లను తొలగించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఒకవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణం మీదుగా వస్తున్న విద్యుత్ వైర్లను తొలగించి సరఫరా నిలిపి వేయడంతో కైకలూరు పట్టణంలో సగభాగం విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులు సైతం ఉక్కపోతను ఎదుర్కొ న్నారు. ఇళ్ల వద్ద పిల్లలు, వృద్ధులు పడిన బాధలు వర్ణనాతీతంగా మారాయి.

ప్రయాణికుల పాట్లు

ముఖ్యమంత్రి సభతో ట్రాఫిక్ నిబంధనలు విధించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచే కైకలూరు పట్టణంలోకి ఏ విధమైన వాహనాలు రాకుండా బారికేడ్లు అడ్డు పెట్టి పోలీసులు ఎక్కడికక్కడే ఆంక్షలు విధించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు దారి మళ్లించారని తెలియక కైకలూరు పట్టణానికి సమీపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వెనుతిరిగి పది కిలోమీటర్ల పైనే వారి గమ్యస్థానానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు సైతం పట్టణంలోకి రాకుండా అడ్డుకోవడంతో బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు.



గొప్పలు చెప్పుకునేందుకు బోర్డు ఏర్పాటు..

వైసీపీ ప్రభుత్వంలో సుమారు ఏడాదిన్నర క్రితం కైకలూరు ప్రభుత్వాసుపత్రిని 30 నుంచి 50 పడకల ఆసుపత్రిగా మార్పు చేశారు. అయినా ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు లేవు. వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం సభను పురస్కరించుకొని ఆసుపత్రి వద్ద 50 పడకల ఆసుపత్రిగా మార్పు చేసి వైద్యుల ఫోటోలు సైతం బోర్డులో ఏర్పాటుచేసి గొప్పలు చెప్పుకునే ప్రయత్నాలు చేశారు. సభా ప్రాంగణానికి దగ్గరగా ప్రభుత్వాసుపత్రి ఉండడంతో వైసీపీ నాయకులు ప్రజల ను తప్పుదారి పట్టించేందుకు బోర్డులు ఏర్పాటుచేశారని ప్రజలు బహిరం గంగానే విమర్శలు చేశారు. 50 పడకల ఆసుపత్రిగా ఎప్పుడూ వైద్యసేవలు అందలేదని, అనూహ్యంగా బోర్డులు తయారు చేయడం పట్ల విమర్శలు వ్యక్తం అయ్యాయి.



వడ్లకూటితిప్ప గ్రామస్థులతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కామినేని



లోడిదలంక ప్రచారంలో ఆక్వా రైతులను పరామర్శిస్తున్న కామినేని

పెద్దింట్లమ్మ సాక్షిగా కొల్లేరు సమస్య పరిష్కరిస్తా : కామినేని

కైకలూరు, మే 11: కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని కొల్లేటి పెద్దింట్లమ్మ సాక్షిగా ప్రజలకు మాట ఇస్తున్నానని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు మండలం వడ్లకూటితిప్ప గ్రామంలో ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామస్థులంతా కలసికట్టుగా బీజేపీకి ఓట్లు వేసి గెలిపిస్తామని కామినేనికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు కొల్లేరు ప్రజలకు అండగా ఉంటానని కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 5 కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదిస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా కొల్లేరు ప్రజలపై వైసీపీ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పినట్లుగా నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న దుర్మార్గ నాయకులను రాజకీయాల్లో లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కలిదిండి: తనకు ఓటేసి గెలిపిస్తే తుది శ్వాస వరకు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం లోడిదలంక, ఇందిరా కాలనీ, బర్రింకల గరువు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూశారన్నారు. ఆక్వా రంగాన్ని విస్మరించటంతో చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర లేక ఆక్వా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 80 శాతం మంది ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసి రైతులు పండించే చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించటానికి కృషి చేస్తానన్నారు. సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయించటంతోపాటు లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తానని, ప్రమాదకరంగా ఉన్న వంతెనలను గుర్తించి వాటి స్థానంలో కొత్త వంతెనల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి స్వలాభంతో వ్యవహరించి తన ఆస్తులను పెంచుకున్నారని ఆరోపించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం జగన్ కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. వైసీపీ రాక్షస పాలనను అంతం చేయాలన్నారు. కూటమి అభ్యర్థినైన తనకు కమలం గుర్తుపై, పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ నున్న కృష్ణబాబు, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, లోడిదలంక సర్పంచ్ బండి సత్య నారాయణ, మాజీ సర్పంచ్ యార్లగడ్డ మురళీ, మాజీ ఎంపీటీసీ సుదాబత్తుల రాధాకుమారి, లంకా రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపైనే రెండో సంతకం



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కాపీలను చించివేస్తున్న కామినేని తదితరులు

కైకలూరు, మే 11: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను దోచుకునేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అవగాహనతో ఓటు ద్వారా వాటిని తిప్పికొట్టాలని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు కూటమి కార్యాలయంలో ప్రభుత్వం విడుదల చేసిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేసేందుకు చంద్రబాబు రెండో సంతకం చేస్తారని అన్నారు. జగన్ తీసుకువచ్చిన ఈ యాక్ట్ వల్ల ప్రజలు స్వచ్ఛందంగా ఒక సెంటు భూమి కొనుగోలు చేసుకుంటే దాని డాక్యుమెంట్లు ప్రభుత్వం ఉంచుకొని జిరాక్సు కాపీలు మాత్రమే యజమానికి ఇస్తుందని, అది బ్యాంకు రుణాలకు గానీ, వారి అవసరాలకు అమ్ముకోవాలన్నా ఆ భూమి తనదేనని రుజువు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఆ భూములు నిర్ధారించడానికి ఒక అధికారిని నియమిస్తారని అతను ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారతారన్నారు. భూమి సరిహద్దు వివాదాల్లో సైతం అధికారుల నిర్ణయమే పైచేయిగా ఉంటుందని ఆ సమయంలో ఉన్న ప్రభుత్వ పెద్దల నిర్ణయాలే జరుగుతాయని అందువల్ల సామాన్య ప్రజలు సైతం నష్టపోయే పరిస్థితిలో ఉంటారన్నారు. ఆడపిల్లల పెళ్లి చేసి కట్నంగా భూమి ఇవ్వాలంటే ఈ డాక్యుమెంట్లు ప్రభుత్వం వద్ద ఉండడం వల్ల తరతరాల నుంచి ఆ భూమి ఎలా సంక్రమిస్తుందనేది తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందువల్ల ప్రజలందరూ అవగాహనతో కూటమిని గెలిపించుకోవాన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు చెన్నంశెట్టి మురళీకృష్ణ, వలవల రామారావు, నర్సిపల్లి అప్పారావు, కేశిరెడ్డి బలరాం, తాడినాడ బాబు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం

కైకలూరు, మే 11: నెల రోజులుగా గ్రామాల్లో ఎన్నికల ప్రచారాలతో మారు మోగాయి. శనివారంతో ఈ ప్రచారానికి ముగింపు పలికారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 5 గంటలకు ఎక్కడికక్కడే ప్రచారాలు, మైకులు మూగబోయాయి. నెల రోజుల పాటు హోరెత్తిన ప్రచారం, ఇరు పార్టీల అభ్యర్థుల సభలు, సమావేశాలతో గ్రామాల్లో ఎన్నికల సందడి చోటు చేసుకుంది. ఎటు చూసినా ప్రధాన పార్టీలైన బీజేపీ, వైసీపీ అభ్యర్థులు కామినేని శ్రీనివాస్, దూలం నాగేశ్వరరావు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కైకలూరు రాజకీయాన్ని వేడెక్కించారు. ఇప్పటికే గ్రామాల్లో ఇరు పార్టీల కార్యకర్తలు ప్రచారాలు చేశారు. కామినేని తనదైన శైలిలో ప్రత్యర్థుల కంటే ఎక్కువగా ప్రచారంలోనూ, ప్రజల్లో మమేకం అవడంలోను ముందుంజలో ఉన్నారు. చివరిరోజు కైకలూరులో పెద్దఎత్తున కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే గ్రామగ్రామాన చివరిరోజు ప్రచారంతో కూటమి నాయకులు హోరెత్తించారు. ఏలూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, తెలుగు మహిళా కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: నెల రోజులుగా హోరాహోరీగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. చివరి రోజున ముదినేపల్లి మండలంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని హోరెత్తించారు. కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తరఫున నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముదినపేపల్లి, చిగురుకోటలో ఇంటింటా ప్రచారం నిర్వహించగా, కాకరవాడలో కొత్తూరు విఠల్,



ముదినేపల్లిలో కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ప్రచారం

తిరువీధుల శారద తదితరులు కామినేని తరఫున ప్రచారం చేశారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను పంపిణీ చేశారు. ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

నూజివీడు: గత రెండు నెలలు నుంచి మైక్‌ల ద్వారా జరిగే ఎన్నికల ప్రచారహోరు, శనివారం సాయంత్రం 5 గంటలకు సద్దుమణిగింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రచార పర్వం ముగిసింది. ఓట్లకు నోట్లు పంపిణీ ప్రారంభమైంది. పోలీస్‌ల హడావిడి, ఈ సారి ఎన్నికల్లో అంతగా కనిపించలేదు నూజివీడు పట్టణంలో వైసీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రూరల్ గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించుకొని, సాయంత్రం 6 గంటలకు నూజివీడులోని తమ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇరు పార్టీలు ఎదుటి పార్టీ ఓటర్లతో చీకటి ఒప్పందాలకు తెరతీసే అవకాశం ఉంది.



యర్రావారిగూడెం వద్ద తమ్మిలేరు చెక్‌డ్యామ్‌లో నీరు

చెక్‌డ్యామ్ కళకళ

చాట్రాయి, మే 10: యర్రావారిగూడెం వద్ద తమ్మిలేరు చెక్‌డ్యామ్ మండు వేసవిలోను కనువిందు చేస్తున్నది. చెక్‌డ్యామ్‌లో నీరు నిండుగా ఉండటంతో పశుపక్ష్యాదులు, వన్యప్రాణుల దాహార్తి తీరటమే కాక, ఏటి ఒడ్డు గ్రామాలైన యర్రావారిగూడెం, కొత్తగూడెం, యడవల్లి గ్రామాల్లో భూగర్భ జల మట్టం పెరిగి ప్రజల తాగునీటి ఇబ్బందులు తీరుతున్నాయి. వ్యవసాయ బోర్లు కూడా బాగా పనిచేసి రైతుల సాగునీటి సమస్య తీరుస్తున్నాయి. యర్రావారిగూడెం రైతులు, గ్రామస్థులు వేసవిలో ఈ చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

సికింద్రాబాద్ - విశాఖకు ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, మే 11 : వేసవి కాలంలో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ - విశాఖపట్టణానికి ప్రత్యేక రైలును ఈ నెల 12, 13 తేదీల్లో నడుపుతోంది. రైలు నంబర్ 07097 సికింద్రాబాద్‌లో 12వ తేదీ ఆదివారం ఉదయం సాయంత్రం 7.45కు బయలుదేరి 13వ తేదీ ఉదయం 6.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07098 విశాఖలో ఈ నెల 13వ తేదీ సోమవారం రాత్రి 7.50 నిముషాలకు బయలుదేరి మరుసటి రోజు 8.15 నిముషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రెండు సర్వీసులు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, విశాఖపట్టణం రైల్వే స్టేషన్లలో ఆగనుంది.



రమణక్కపేటలో విద్యుత్ స్తంభంపై ఉన్న సీఎం జగన్ స్టిక్కర్

వైసీపీ కోడ్ ఉల్లంఘన పట్టదా?

మునునూరు, మే 11: అధికార వైసీపీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. రమణక్కపేట గ్రామంలో విద్యుత్ స్తంభాలు, ఇళ్ల గేట్లు, గోడలపై సీఎం జగన్ స్టిక్కర్లు దర్శనమిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. వైసీపీ నాయకులు, రాజీనామా చేసిన వలంటీర్లు సంయుక్తంగా ప్రతి ఇంటికి జగన్ స్టిక్కర్ వేయడంతోపాటు పబ్లిక్ ప్రదేశాల్లో కూడా ఇస్టానుసారంగా స్టిక్కర్లను అతికిస్తున్నా స్థానిక అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో అసలు ఎన్నికల కోడ్ అమలు జరుగుతుందా అనే సందేహం కలుగుతుందని పలువురు వాపోతున్నారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం పలుచోట్ల సీఎం జగన్ స్టిక్కర్లును స్థానిక అధికార పార్టీ నేతలు వేయించారని, వైసీపీకి అధికారులు కొమ్ముకాస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న జగన్ స్టిక్కర్లను తొలిగించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీల నాయకులు కోరుతున్నారు.



మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

ఓటర్ల స్లిప్‌లు అందరికీ చేరాలి : ట్రైనీ కలెక్టర్

కలిదిండి, మే 11 : ఓటర్ల స్లిప్‌లు ఓటు హక్కు ఉన్న వారందరికీ చేరాలని ట్రైనీ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ బీఎల్‌వోలను ఆదేశించారు. శనివారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో మండల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తొలుత ఎస్సార్పీ అగ్రహారంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చిన ఓటర్లను గుర్తించి ఓటర్ల స్లిప్పులు అందించాలన్నారు. అందుబాటులో లేకపోతే వాట్సప్‌లో ఓటరు స్లిప్పులు అందించాలన్నారు. గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో దినతేజ్, డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, వీఆర్వోలు పాల్గొన్నారు.



అప్పారావు పేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు

పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

ముదినేపల్లి, మే 11 : ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు ముదినేపల్లి మండలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. రిటర్నింగ్ అధికారి భాస్కర్ పర్యవేక్షణలో మండలంలోని సుమారు 49 వేల మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసిన 61 పోలింగ్ కేంద్రా ల్లో ఏర్పాట్లను శనివారం ముమ్మరంగా చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద రద్దీని నివారించేందుకు బారికేడ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరసకుమారి తెలిపారు. మండలంలో ఎన్నికల నిర్వహణకు 61 మంది ప్రిసై డింగ్ ఆఫీసర్లు, 61 మంది ఏపీవోలు, ఇతర సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

ముసునూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ జవహర్‌బాజి తెలిపారు. సూరేపల్లిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించి మాట్లాడుతూ సోమవారం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మండల వ్యాప్తంగా 57 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్‌కు ఇబ్బంది లేకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో మంచినీరు, విద్యుత్, బారికేడ్లు, షామినాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులను, వృద్ధులను పోలింగ్ కేంద్రంలోకి తీసుకువెళ్ళేందుకు వీల్‌చైర్స్‌ను కూడా సిద్ధం చేశామన్నారు. 22 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వీటి వద్ద వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలు, పటిష్ట బందోస్తు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 45537 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 22815 మంది, స్త్రీలు 22719మంది, ట్రాన్స్‌జెండర్‌లు ముగ్గురు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ కోరారు.

చంద్రబాబును కలసిన బీఆర్ఎస్ నాయకుడు



చంద్రబాబును కలసిన సతీష్ అరోరా

ముదినేపల్లి, మే 11: గ్రేటర్ హైదరాబాద్ లోని కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అనుచరుడు ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన రెడ్డి సతీష్ అరోరా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలిశారు. శుక్రవారం ఉండవల్లి లోని ఆయన నివాసంలో కలసి ఏపీలో తెలుగుదేశం పార్టీకి తన మద్దతు ప్రకటించారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరించిన అరోరా బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ చంద్రబాబు అభిమానిగా ఉన్నారు. దీంతో ఎన్నికల వేళ ఆయనను కలసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాల్సి ఉందని తెలిపారు.



కామినేని విజయం కోసం పూజలు

ముదినేపల్లి, మే 11 : కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ముదినేపల్లి మండలం వడాలిలోని ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పూజలు జరిపారు. నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ నాయకులు గురువు సుబ్రహ్మణ్యం, మట్టా మల్లేషు, జొన్నవిత్తుల విశ్వనాథం, నారగాని చిరంజీవి, నక్కా పోలయ్య తదితరులు పూజలు చేశారు.